జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989894528

రంగారెడ్డి | మంగళవారం 7 ఏప్రిల్ 2026 | సంపుటి : 16 | సంచిక : 254 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

## పుష్కలంగా ఆహార నిల్వలు

- దేశంలో మూడు రెట్లు అధికంగా ఆహార నిల్వలు
- దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరగలేదు
- నిత్యావసర వస్తువుల ధరల విషయంలో కీలక ప్రకటన చేసిన కేంద్ర ప్రభుత్వం
- దేశంలో పుష్కలంగా ఆహార నిల్వలు ఉన్నాయన్న మోదీ సర్కార్




# ఇదీ మా అభివృద్ధి

- పినరయి విమర్శలపై సీఎం రేవంత్ సుదీర్ఘ లేఖ
- సీఎం పినరయి విజయన్‌పై నాకు అపారమైన గౌరవం ఉంది
- ఆయన చేసిన ట్వీట్లను శ్రద్ధగా చదివాను
- రెండు రాష్ట్రాల ప్రజల ముందు నిజాలు వెల్లడించడం నా బాధ్యత.
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రూ.20,617 కోట్ల మేర రైతు రుణాలను మాఫీ చేశాం
- 25.36 లక్షల మంది రైతులను రుణ విముక్తుల్ని చేశాం
- ఇది తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుంది.



హైదరాబాద్

కేరళ సీఎం పినరయి విజయన్ చేసిన విమర్శలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాలకు ఉన్న సారూప్యతను బేరీజు వేసి సుదీర్ఘమైన వివరణ ఇస్తూ ఆయనకు లేఖ రాశారు. రెండు రాష్ట్రాల్లో అభివృద్ధి, అక్షరాస్యత, తదితర అంశాలను పూర్తి గణాంకాలతో వివరించారు. " సీఎం పినరయి విజయన్‌పై నాకు అపారమైన గౌరవం ఉంది. ఆయన చేసిన ట్వీట్లను శ్రద్ధగా చదివాను. రెండు రాష్ట్రాల ప్రజల ముందు నిజాలు వెల్లడించడం నా బాధ్యత. మీరు చేసిన విమర్శలకు పూర్తి గణాంకాలతో సమాధానం ఇస్తున్నాను. 2024-25 ఆర్థిక ఏడాదిలో తెలంగాణ జీఎస్‌డీపీ వృద్ధి 10.1 శాతంగా ఉంది. ఇది జాతీయ జీడీపీ 9.9 శాతం కంటే - మిగతా3లో



## సోమవారంలోపే 60లక్షల క్లెయిమ్‌ల పరిష్కారం

- బంగాల్ ఎస్ఐఆర్‌పై సుప్రీం కోర్టు విచారణ
- అభ్యంతరాల పరిష్కారంపై సంతృప్తి వ్యక్తం చేసిన సర్వోన్నత న్యాయస్థానం
- రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర బలగాలను ఉపసంహరించేది లేదు

## చొరబాటుదారులను బాధితులుగా చూపిస్తున్న కాంగ్రెస్

- "బీజేపీ అసోంలోని అక్రమ భూఆక్రమణలను అరికట్టాలని చూస్తోంది
- స్వదేశీ ప్రజలను ముప్పులోకి నెట్టే ప్రయత్నం: మోదీ
- 'మహిళా రిజర్వేషన్ చట్టం వల్ల రాష్ట్రాల ప్రాతినిధ్యానికి ఎలాంటి ఢోకా ఉండదు'
- అసోం ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు





# పట్టు బిగిస్తున్న రేవంత్

- ముఖ్యమంత్రిగా ఎన్నికైన తొలి రోజుల్లో కాస్త ఇబ్బంది పడ్డారు
- ఆ తర్వాత పరిపాలన మీద పట్టు సాధించడం మొదలుపెట్టారు
- మంత్రుల మీద కూడా తన మార్క్ పెత్తనం ప్రదర్శిస్తున్నారు
- ఆర్థిక పరిపుష్టి ఉన్న నాయకుడు కావడంతో అధిష్టానం రేవంత్ రెడ్డికి కేరళ బాధ్యతలు అప్పగించింది

హైదరాబాద్

రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ముఖ్యమంత్రిగా ఎన్నికైన తొలి రోజుల్లో కాస్త ఇబ్బంది పడ్డారు. ఆ తర్వాత పరిపాలన మీద పట్టు సాధించడం మొదలుపెట్టారు. మంత్రుల మీద కూడా తన మార్క్ పెత్తనం ప్రదర్శిస్తున్నారు. అధిష్టానం ఎదుట మంచి మార్కులు సాధించుకొని.. గట్టి లీడర్ గా ఎదిగారు. కర్ణాటక.. ఇంకా కొన్ని ప్రాంతాలలో అధికారంలో ఉన్నప్పటికీ.. ఆర్థిక పరిపుష్టి ఉన్న నాయకుడు కావడంతో అధిష్టానం రేవంత్ రెడ్డికి కేరళ బాధ్యతలు అప్పగించింది.దేశంలో ప్రస్తుతం ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో కేరళ కూడా ఉంది. కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్ తరపున ప్రచారం చేస్తున్నారు రేవంత్ రెడ్డి. తెలంగాణ రాష్ట్రాన్ని చెందిన ఇతర ముఖ్య నేతలు కూడా ప్రస్తుతం కేరళలోనే మకాం వేశారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులు.. ఫైర్ బ్రాండ్ లీడర్లు.. గట్టి స్వరం ఉన్న నాయకులు కేరళ రాష్ట్రంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రచారం చేస్తున్న వారిలో దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా ఉన్నారు. తన రాజకీయ జీవితంలో తొలిసారి కేరళ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న రేవంత్ రెడ్డి.. కేరళ రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో నిర్వహిస్తున్న - మిగతా3లో



## పాకిస్థాన్ బెదిరింపులపైనా మోదీ స్పందించలేదు

- ప్రధాని రాజీనామా చేయాలి : మమత కీలక వ్యాఖ్యలు
- కోల్‌కత్తాను లక్ష్యంగా చేసుకుంటామని పాకిస్థాన్ రక్షణ మంత్రి హెచ్చరిక
- బంగాల్ ఎన్నికల ప్రచార సభల్లో మోదీ ఆ విషయాన్ని ఎందుకు ప్రస్తావించలేదు
- మేం కఠిన చర్యలు తీసుకుంటామని ఎందుకు అనలేదు

# ఏఐతో దోమలను నియంత్రించవచ్చు

- ప్రొఫెసర్ రెడ్యా నాయక్
- హైదరాబాద్ నగరాన్ని వణికిస్తున్న దోమలు
- నిద్రలేని రాత్రులు గడుపుతున్న నగరవాసులు
- ఏఐ ఉపయోగించి దోమల నివారణకు జీహెచ్ఎంసీ కృషి
- ఓయూ జీవశాస్త్ర విభాగంతో కలిసి దోమల నియంత్రణకు ప్రయోగాలు

హైదరాబాద్

హైదరాబాద్ మహానగరంలో దోమల ఉద్ధృతికి నగరవాసులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. దోమకాటుతో సామాన్యుల నుంచి సంపన్నుల వరకు ఆస్పత్రుల పాలవుతున్నారు. క్యూలెక్స్, ఎడిస్ దోమల కాటుతో డెంగ్యూ, మలేరియా జ్వరాలతో అల్లాడిపోతున్నారు. దోమల నివారణకు అనేస పద్ధతులు పాటిస్తున్నప్పటికీ ఏ మాత్రం ఫలితం ఉండటం లేదు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన - మిగతా3లో





## ప్రజల సంక్షేమం తప్ప.. వ్యక్తిగత ప్రయోజనాలు లేవు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీల అమలుపై జీవోలు జారీ చేశాం
- రూ.1,238 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశాం
- ఒకే విడతలో రుణమాఫీ చేసి రూ.22,500 కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం

# వారు రాజకీయ ప్రత్యర్థులే తప్ప శత్రువులు కాదు

- ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తాం
- ఆదిలాబాద్ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి
- త్వరలోనే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేస్తామని వెల్లడి
- బాసర ఆలయ అభివృద్ధికి రూ.220 కోట్ల మంజూరు
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకపోయినప్పటికీ, అన్ని నియోజకవర్గాలకు నిధులు ఇస్తున్నాం



ఆదిలాబాద్

గత ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ సర్కారు తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించి జిల్లాలో గోదావరి నీళ్లు పారిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు త్వరలోనే శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. ఈ జిల్లాను పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. త్వరలోనే ఆదిలాబాద్‌కు యూనివర్సిటీ మంజూరు చేసి శంకుస్థాపన చేస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్నటువంటి ఆలయాలన్నింటిని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఆదిలాబాద్ జిల్లాలో పలు - మిగతా3లో



## సీఎం దేవుడేమీ కాదు!

- మోదీ, పినరయి విజయన్ అహంకారులు'
- రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు
- కేరళ ఎన్నికల కోసం బీజేపీ, సీపీఎం మధ్య డీల్
- ప్రియాంక గాంధీ ఆరోపణ
- "ఎల్‌డీఎఫ్‌కు ఒక అదృశ్యహస్తం సహాయం చేస్తోంది
- ప్రస్తుత ప్రభుత్వం నిజమైన వామపక్షంలా పరిపాలన చేయడం లేదు.

# చొరబాటుదారులను బాధితులుగా చూపిస్తున్న కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం విమర్శల వర్షం గుప్పించారు. అసోంలో చొరబాటుదారులకు కాంగ్రెస్ మద్దతు ఇస్తోందని, అక్రమ భూఆక్రమణలకు వ్యతిరేకంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అడ్డుకుంటోందని ఆరోపించారు. బార్పేటలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించిన ఆయన, చొరబాటుదారులను 'బాధితులు'గా పరిగణించే చట్టాలను తీసుకురావడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, దీని ద్వారా స్వదేశీ ప్రజలు ప్రమాదంలో పడుతుందని మోదీ పేర్కొన్నారు. "బీజేపీ అసోంలోని అక్రమ భూఆక్రమణలను అరికట్టాలని చూస్తోంది. కానీ కాంగ్రెస్ బహిరంగంగానే చొరబాటుదారులకు మద్దతు ఇస్తోంది. పైగా అక్రమ ఆక్రమణలకు అడ్డుకట్టవేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకిస్తోంది. అసోంలో కాంగ్రెస్ ఎలాంటి చట్టాన్ని తీసుకురావాలని అనుకుంటోందంటే, ఎవరైనా చొరబాటుదారుడు అనే పదాన్ని ఉపయోగిస్తే, వారు జైలుకు వెళ్లే పరిస్థితి వస్తుంది. కాంగ్రెస్? పార్టీ చట్టంలోనే చొరబాటుదారులను 'బాధితులు'గా పరిగణిస్తుంది. దీని వల్ల మెజారిటీ స్వదేశీ ప్రజలు జైలు శిక్ష ముప్పును ఎదుర్కోవాల్సి వస్తుంది." 'శ్రీమంత శంకరదేవ, మాధవదేవ, దామోదరదేవ, హరిదేవ్ మొదలైన వైష్ణవ సాధువుల పవిత్ర మఠాలకు చెందిన వేల బిగాల భూమి బార్పేటలో ఉంది. ఆ భూమిని చొరబాటుదారులు ఆక్రమించుకునేందుకు కాంగ్రెస్ అనుమతించింది. దీనితో చాలా భూభాగం అక్రమ ఆక్రమణలకు గురైంది' అని మోదీ ఆరోపించారు.

**కాంగ్రెస్‌కు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం!**

అసోం సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని నొక్కి చెబుతూ, బోడో సామాజిక వర్గానికి చెందిన 'హుదుమ్ పూజ', కోచ్?-రాజ్?బోంగ్శి వర్గానికి చెందిన 'బాతౌ' అనేవి అసోం సంస్కృతి,



ప్రకృతి, విశ్వాసాల మధ్య ఉన్న సామరస్యానికి ఉదాహరణలుగా ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం రాష్ట్ర ప్రయోజనాల కంటే, రాజకీయ అధికారానికే అధిక ప్రాధాన్యత ఇచ్చిందని, అందువల్ల అసోం సంప్రదాయాలకు గొప్ప నష్టం వాటిల్లిందని ఆయన అన్నారు.

**మహిళా రిజర్వేషన్స్ వల్ల నో ప్రోబ్లం!**

మహిళా రిజర్వేషన్ చట్టం అమలు కోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తుండడంపై విపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. దీనిపై కూడా మోదీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వల్ల ఏ రాష్ట్ర ప్రాతినిధ్యానికీ భంగం వాటిల్లదని ఆయన పేర్కొన్నారు. అందువల్ల అన్ని రాజకీయ పార్టీల నేతలు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాల్లో అమలులో ఉన్న జనాభా నియంత్రణ చర్యల గురించి కూడా ఆయన ప్రస్తావించారు.

"ఏప్రిల్ 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పటికే ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో మేము చర్చించాం. దేశంలోని సోదరీమణుల, కుమార్తెల హక్కులకు సంబంధించిన ఈ పనిని ఏకగ్రీవంగా ముందుకు తీసుకెళ్లాలని మేము అందరినీ కోరాం. అయితే కొందరు వ్యక్తులు ఈ గొప్ప కార్యంపై గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. వాస్తవానికి దేశంలోని అన్ని రాష్ట్రాలు దీనివల్ల ప్రయోజనం పొందుతాయి. దీని వల్ల ఏ రాష్ట్రానికి నష్టం వాటిల్లదు. జనాభా నియంత్రణ ఎక్కువగా ఉన్న ఈశాన్య రాష్ట్రాలు కావచ్చు లేదా దక్షిణాది రాష్ట్రాలు కావచ్చు. వారి ప్రాతినిధ్యం ఏమాత్రం తగ్గదు. మహిళల కోసం అదనపు సీట్లు కేటాయించేలా మేము ఏర్పాట్లు చేస్తున్నాం. అలాగే ప్రస్తుతం ఉన్న సీట్లను మరింత పెంచాల్సిన అవసరం ఉంది. అందుకే, ఈ చట్టాన్ని అందరూ కలిగి ఆమోదించేలా రాజకీయ పార్టీల నేతలపై ఒత్తిడి తీసుకురావాలని నేను ప్రత్యేకంగా అసోం సోదరీమణులను కోరుతున్నాను."

**డీలిమిటేషన్?**

దేశంలోని నియోజకవర్గాల పునర్విభజన కోసం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా నిర్ణయించారు. దీనికి అనుగుణంగా డీలిమిటేషన్ చట్టాన్ని సవరించనున్నారు. ఈ చట్టాన్ని ఆమోదించడానికి 2/3వ వంతు మెజారిటీ అవసరం. అందుకే ప్రతిపక్ష పార్టీల మద్దతు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఏప్రిల్? 16 నుంచి జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే దీనిపై చర్చించనున్నారు.

# 'సీఎం దేవుడేమీ కాదు!

ప్రధాని నరేంద్ర మోదీ, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్? ఇద్దరూ 'అహంకారులు' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. వాళ్లిద్దరూ ప్రజలతో కలిసి పనిచేయడం కంటే, వారిపై పాలన సాగించాలనే మనస్తత్వం కలిగినవారని ఆయన ఆరోపించారు. కేరళలోని త్రిస్సూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మాట్లాడిన రాహుల్? గాంధీ, కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీ కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్, అధికార ఎల్?డీఎఫ్? మధ్యే ఉంటుందన్నారు. అయితే ఎల్‌డీఎఫ్‌కు బీజేపీ లోపాయికారంగా సహకరిస్తోందని విమర్శించారు. "ఎల్‌డీఎఫ్‌కు ఒక అదృశ్యహస్తం సహాయం చేస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం నిజమైన వామపక్షంలా పరిపాలన చేయడం లేదు. దీన్ని అధికార సీపీఎం కార్యకర్తలు కూడా అంగీకరిస్తారు. వాస్తవానికి దేశవ్యాప్తంగా చూసుకుంటే బీజేపీ తన ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్? అని భావిస్తోంది. కేరళలో అయితే కాంగ్రెస్? నేతృత్వంలోని యూడీఎఫ్?ను ప్రధాన ప్రత్యర్థిగా చూస్తోంది. దీనికి నిదర్శనం ఏమిటంటే, ప్రధాని మోదీ ఇతర చోట్ల తన ప్రసంగాల్లో దేవుడు, దేవాలయాలు, మతం గురించి మాట్లాడతారు. కానీ కేరళలో సీపీఎం నాయకులతో సంబంధం ఉన్న శబరిమల బంగారం మాయమైన అంశంపై మాత్రం మాట్లాడరు. ఎందుకంటే కేరళ ముఖ్యమంత్రిని, సీపీఎంను రక్షించాలని ఆయన కోరుకుంటున్నారు. ఎల్?డీఎఫ్?ను కాపాడడం కోసం ఆయన కేరళలో దేవుడిని, హిందూత్వాన్ని, దేవాలయాలను మర్చిపోయారు."



**నన్ను టార్గెట్ చేశారు!**

ప్రతిపక్ష నేతల విషయంలో బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలను తమ ఇష్టారీతిన ఉపయోగించుకుంటున్నాయని రాహుల్ గాంధీ విమర్శించారు. "నేను వారిని విమర్శిస్తున్నాను కాబట్టి నా ప్రభుత్వ నివాసాన్ని, నా పార్లమెంట్ సభ్యత్వాన్ని లాగేసుకున్నారు. నాపై కేసులు పెట్టి, విచారణ చేశారు. కానీ కేరళ ముఖ్యమంత్రిని, ఆయన కుటుంబాన్ని మాత్రం తాకడం లేదు. ఆయనపై ఈడీ, సీబీఐ చర్యలు లేవు" అని రాహుల్ గాంధీ ఆరోపించారు. 'మేము ఇక్కడ ఒక పార్టనర్‌షిప్‌నకు (బీజేపీ, ఎల్‌డీఎఫ్) వ్యతిరేకంగా పోరాడుతున్నట్లు స్పష్టమవుతోంది. మణిపూర్‌లో మంటలు పెట్టినవారు, ఛత్తీస్‌గఢ్‌లో నర్సులపై దాడి చేసినవారు, మత ప్రాతిపదికను భారతదేశాన్ని విభజించి ద్వేషాన్ని, హింసను వ్యాప్తి చేస్తున్నవారే ఆ భాగస్వాములు' అని రాహుల్ గాంధీ అన్నారు.

**సీఎం దేవుడేమీ కాదు!**

విజయన్ చిత్రంతో ఉన్న 'హూ ఎల్స్' (ఇంకెవ్వరు) అనే నినాదం ఉన్న ఎల్?డీఎఫ్? ప్రచార బోర్డులపై కూడా రాహుల్ విమర్శలు గుప్పించారు.? 'కేరళను పాలించడానికి ముఖ్యమంత్రి దేవుడు ఏమీ కాదు. రాష్ట్రంలో అపారమైన మేధస్సు, సామర్థ్యం ఉన్న మహిళలు, ప్రతిభావంతులు ఎందరో ఉన్నారు' అని పేర్కొన్నారు. హూ ఎల్స్? అనే నినాదం రాష్ట్ర ప్రజలను కించపరచడమేనని, అది అహంకారానికి పరాకాష్టగా అభివర్ణించారు. 'మేము పోరాడుతున్నది సరిగ్గా ఇలాంటి అహంకార పూరిత మనస్తత్వంతోనే. మోదీ, అమిత్? షా, అసోం సీఎం హిమంత బిశ్వ శర్మలది కూడా ఇదే మనస్తత్వం. తాము ప్రజలను పాలించడానికే ఇక్కడ ఉన్నామనే భావన వాళ్లది. అయితే తాము మాత్రమే పాలించగలమని చెప్పుకోవడానికి ఇది మహారాజుల కాలం కాదు' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**బీజేపీతో సీపీఎం డీల్**

మరోవైపు, కేరళలో ఏప్రిల్ 9న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం సీపీఎం నేతృత్వంలోని కూటమితో బీజేపీ డీల్ కుదుర్చుకుందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ ఆరోపించారు. 10 ఏళ్లపాటు అధికారంలో కొనసాగడం కోసం అధికార ఎల్‌డీఎఫ్ తన సిద్ధాంతాలు, జవాబుదారీతనం, బాధ్యతల విషయంలో పూర్తిగా రాజీపడిందని ఆమె విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర కేరళ జిల్లాలోని పెరవూర్?లో జరిగిన ఓ మీటింగ్?లో వయనాడ్ ఎంపీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

# పుష్కలంగా ఆహార నిల్వలు

పశ్చిమాసియా సంక్షోభం కారణంగా దేశంలో నిత్యావసర వస్తువుల ధరల్లో ఎటువంటి అసాధారణ హెచ్చుతగ్గులేమీ లేవని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లలో ధరలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపింది. ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరాలకు, అలాగే ఏవైనా అత్యవసర పరిస్థితులకు సరిపడా గోధుమలు, బియ్యం నిల్వలు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి అనుపమ్ మిశ్రా వ్యాఖ్యానించారు. "దేశంలో ఆహార భద్రత పరిస్థితిని వినియోగదారుల వ్యవహారాల శాఖ నిశితంగా గమనిస్తోంది. ఆహార పదార్థాల ధరలను పర్యవేక్షిస్తున్నాం. అలాగే ఆహార పదార్థాల నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించడానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నాం. దేశవ్యాప్తంగా ఉన్న 528 కేంద్రాల నుంచి వినియోగదారుల వ్యవహారాల శాఖ ప్రతిరోజూ 40 రకాల వస్తువుల ధరలను పొందుతుంది. హోల్‌సేల్, రిటైల్ ధరలు మొబైల్ యాప్‌లో అప్డేట్ చేస్తున్నాం. ఇప్పటివరకు మేము గమనించిన వరకు నిత్యావసర వస్తువుల ధరల్లో ఎటువంటి అసాధారణ హెచ్చుతగ్గులు లేవు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పప్పుధాన్యాల ఉత్పత్తి ఎక్కువగా ఉంది. ప్రభుత్వం వద్ద 28 లక్షల టన్నుల పప్పుధాన్యాల బఫర్ స్టాక్ ఉంది. ఉల్లిపాయలు, బంగాళదుంప, టమాటాల ఉత్పత్తి దాదాపు గతేడాది స్థాయిలోనే ఉంది." అని అనుపమ్ మిశ్రా పేర్కొన్నారు.

**'రాష్ట్రాలతో సంప్రదింపుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు'**

1955 నాటి నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం, వస్తువుల బ్లాక్ మార్కెటింగ్ లేదా నిల్వలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని అనుపమ్ మిశ్రా వెల్లడించారు. ఈ విషయంపై తాము రాష్ట్ర ప్రభుత్వాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, నిల్వల విషయంలో రాష్ట్రాలతో నిరంతరాయంగా సంప్రదింపులు జరిపేందుకు ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

**'దేశంలో మూడు రెట్లు అధికంగా ఆహార నిల్వలు'**




ప్రస్తుత బఫర్ నిబంధనల కంటే మూడు రెట్లు అధికంగా దేశంలో ఆహార ధాన్యాల నిల్వలు ఉన్నాయని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ సంయుక్త కార్యదర్శి సి. శిఖ తెలిపారు. దేశంలో ప్రస్తుతం సుమారు 222 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలు, దాదాపు 380 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. దీంతో మొత్తం ఆహార నిల్వలు సుమారు 602 లక్షల మెట్రిక్ టన్నులకు చేరాయని పేర్కొన్నారు. ఈ నిల్వలు ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరాలను, అలాగే ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వాటిని తీర్చడానికి సరిపోతాయని వ్యాఖ్యానించారు. "ఇండోనేసియా, మలేసియా, రష్యా, ఉక్రెయిన్, అర్జెంటీనా, బ్రెజిల్ వంటి కీలక భాగస్వాముల నుంచి భారత్‌కు దిగుమతులు నిలకడగా కొనసాగుతున్నాయి. ఇది మొత్తం సరఫరా స్థిరత్వానికి దోహదపడుతోంది. ఆవాలు ఉత్పత్తి మెరుగుపడటం వల్ల, ముఖ్యంగా వంట నూనెల విభాగంలో దేశీయ లభ్యత కూడా బలపడింది." అని స్పష్టం చేశారు.

**రెండు రోజుల్లో 2 భారతీయ నౌకలు హార్ముజ్‌ను దాటాయి : ముకేశ్ మంగళ్**

పశ్చిమాసియా ప్రాంతంలోని భారతీయ నావికులందరూ సురక్షితంగా ఉన్నారని, అక్కడ సముద్ర కార్యకలాపాలు స్థిరంగా కొనసాగుతున్నాయని పోర్ట్స్, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ముకేశ్ మంగళ్ వెల్లడించారు. గత 24 గంటల్లో భారత జెండా ఉన్న నౌకలకు సంబంధించి ఎలాంటి దుర్ఘటనలు జరగలేదని పేర్కొన్నారు. గత రెండు రోజుల్లో ఎల్‌పీజీని తీసుకువెళ్తున్న భారత జెండా కలిగిన రెండు నౌకలు గ్రీన్ సంఘ్వీ, గ్రీన్ ఆశా హార్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటాయని తెలిపారు. పశ్చిమ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ప్రస్తుతం 16 భారత జెండా కలిగిన నౌకలు ఉన్నాయని, వాటిలో మొత్తం 433 మంది భారతీయ నావికులు ఉన్నారని చెప్పారు.

**ఎల్‌పీజీ దిగుమతుల్లో సవాళ్లు : సుజాత శర్మ**

రష్యా చమురును దిగుమతి చేసుకునేందుకు భారత్‌కు అమెరికా ఇచ్చిన గడువు ముగిసిపోయినప్పటికీ, భౌగోళిక రాజకీయ అవాంతరాలు ఉన్నప్పటికీ భారత్ స్థిరమైన ఇంధన లభ్యతను కొనసాగించగలిగిందని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు. అయితే ఎల్‌పీజీ దిగుమతులు, సహజ వాయువు సరఫరాలలో సవాళ్లు కొనసాగుతున్నాయని చెప్పారు. దేశం ముడి చమురు సేకరణ వ్యూహం పటిష్టంగా ఉందని అన్నారు. దేశంలో చమురు శుద్ధి కర్మాగారాలు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

"ఎల్‌పీజీ విషయంలో పరిస్థితి మరింత సంక్లిష్టంగా ఉంది. దేశ ఎల్‌పీజీ దిగుమతుల్లో గణనీయమైన భాగం అంటే సుమారు 60 శాతం గతంలో ఒక నిర్దిష్ట ప్రాంతం నుంచి దిగుమతి అయ్యేది. ప్రస్తుతం ఆ ప్రాంతం భౌగోళిక రాజకీయ అస్థిరతతో ప్రభావితమైంది. దీంతో ఎల్‌పీజీ దిగుమతుల్లో తగ్గుదల కనిపిస్తోంది. ఇది కొంత ఆందోళన కలిగించే విషయం." అని సుజాత శర్మ అభిప్రాయపడ్డారు.

**ఇరాన్ నుంచి సేఫ్‌గా భారత్‌కు వచ్చిన 1777 మంది**

పశ్చిమాసియాలో యుద్ధం వేళ అర్మేనియా, అజర్‌బైజాన్‌ల మీదుగా ఇరాన్ నుంచి 1,777 మంది భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చామని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ సోమవారం తెలిపింది. ఇరాన్, అర్మేనియా, అజర్‌బైజాన్ దేశాల అధికారుల సహకారంతో ఇది సాధ్యమైందని పేర్కొంది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం ఇండియన్స్ తరలింపు ప్రయత్నాలను చురుకుగా సమన్వయం చేస్తోందని చెప్పింది. ఈ మేరకు విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు.

## పాకిస్థాన్ బెదిరింపులపైనా మోదీ స్పందించలేదు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి విరుచుకుపడ్డారు. కోల్‌కతాను లక్ష్యంగా చేసుకుంటామని పాకిస్థాన్ రక్షణ మంత్రి హెచ్చరిస్తుంటే, మోదీ మౌనం వహించడం దారుణమన్నారు. బంగాల్ ఎన్నికల పర్యటనలో ఆయన ఆ విషయం గురించి ఎందుకు ప్రస్తావించలేదని మండిపడ్డారు. ఆయన బంగాల్‌లో జరిగే ఎన్నికలను పట్టించుకుంటారు కానీ, పాక్ బెదిరింపులకు పాల్పడినా ఒక్క మాట కూడా మాట్లాడరని దుయ్యబట్టారు. దాయాది దేశం బెదిరింపులకు మౌనం వహించినందుకు గానూ మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం నాడియా జిల్లాలో జరిగిన ఎన్నికల సభలో మమతా ఈ మేరకు వ్యాఖ్యానించారు. "పాకిస్థాన్ రక్షణ మంత్రి చేసిన ప్రేలాపణలను బంగాల్‌లో సభలో ప్రధాని ఎందుకు ప్రస్తావించలేదు పాక్ కోల్‌కతాపై దాడి చేస్తామని చెప్పినప్పుడు, మేం కఠిన చర్యలు తీసుకుంటాం అని మోదీ ఎందుకు అనలేదు? దేశానికి వచ్చే ఏ బెదిరింపునైనా మనం ఎలాగైతే అంగీకరించమో, అలాగే కోల్‌కతాకు వచ్చే హెచ్చరికలను కూడా మేం చూస్తూ ఊరుకోం"

**మమతా బెనర్జీ వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డ బీజేపీ**

మరోవైపు, బీజేపీని ఉద్దేశిస్తూ సీఎం మమత బెనర్జీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. బంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు పహల్గాం తరహా దాడికి బీజేపీ బ్లూప్రింట్ సిద్ధం చేసిందా అని మమత ప్రశ్నించారు. మోదీ మౌనం వెనుక ఏదైనా బ్లూప్రింట్ ఉందా? ఎన్నికల ముందు మరో పహల్గాం దాడి జరగబోతోందా అని ప్రశ్నించారు. కోల్‌కతాను లక్ష్యంగా చేసుకుంటామంటే భారత పౌరులుగా తాము సహించమని మమత తెలిపారు. అయితే, మమతా బెనర్జీ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఆమె ఇలాంటి బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తింది. పహల్గాం ఉగ్రదాడిని మమత బ్లూప్రింట్ అని పేర్కొనడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేసింది.

**అసలేం జరిగింది**

భవిష్యత్తులో భారత్ ఏదైనా దాడులకు పాల్పడితే, కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని ఇటీవల పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ పేర్కొన్నారు. ప్రతిదాడులను ఆ ప్రాంతం వరకూ తీసుకెళ్తామంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎక్కడైనా కొంతమంది మృతదేహాలను పడేసి, వారు ఉగ్రవాదులేనని నమ్మించేలా భారత్ బూటకపు ఆపరేషన్ రూపొందించినట్లు నివేదికలు ఉన్నాయంటూ ఆయన ప్రేలాపణలు చేశారు. అయితే, వాటికి కచ్చితమైన ఆధారాలు ఆయన చూపలేదు. ఇది జరగడానికి ముందు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్థాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగు దేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన చాలా తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. ఇందుకుగానూ ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత చేపట్టిన వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లను ఆయన ఉదహరించారు.

**బంగాల్ ఎన్నికల సమరం**

ఇదిలా ఉండగా, అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గరపడుతున్న తరుణంలో బంగాల్?లో రాజకీయాలు రోజురోజుకీ మరింత హీటెక్కుతున్నాయి. ప్రధాన పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నాయి. ఈ క్రమంలో నదియా జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో మమతా కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ, కాంగ్రెస్, డీఎంకే మధ్య రహస్య ఒప్పందం ఉందని మమతా విమర్శించారు. బంగాల్‌కు చెందిన అనేక మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తమిళనాడుకు ఎన్నికల పరిశీలకులుగా పంపించారని ఆరోపించారు. అయితే, ఎన్నికల వేళ ఇతర రాష్ట్రాల్లో కొంతమంది అధికారులను బదిలీ చేస్తే, బంగాల్‌లో మాత్రం దాదాపు 500 మంది అధికారులను బదిలీ చేశారని దుయ్యబట్టారు. ఈ చర్యల వల్ల రాష్ట్ర అభివృద్ధి పనులు దెబ్బతిన్నాయని వ్యాఖ్యానించారు. అలాగే, బంగాల్‌లో కీలక స్థానాల్లో తమ అనుకూల అధికారులను నియమించి స్వేచ్ఛగా వ్యవహరించేలా ప్రయత్నిస్తున్నారని బీజేపీ ఉద్దేశిస్తూ మమతా ఆరోపణలు చేశారు. మరోవైపు, ఏప్రిల్ 8న తాను భవానీపూర్ నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు మమతా ప్రకటించారు. అయితే, ఎన్నికల అనంతరం దేశవ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలను ఐక్యం చేసే దిశగా పనిచేస్తానని మమత తెలిపారు. కాగా, 294 అసెంబ్లీ స్థానాలకు గానూ బంగాల్?లో ఏప్రిల్? 23, 29 రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. అలాగే మే 4న ఫలితాలు విడుదల కానున్నాయి.

## సోమవారంలోపే 60లక్షల క్లెయిమ్‌ల పరిష్కారం

బంగాల్ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ జాబితా నుంచి తొలగించిన సుమారు 60 లక్షల మంది క్లెయిమ్?లు, అభ్యంతరాలను సోమవారం లోపే పరిష్కరించనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర బలగాలను ఉపసంహరించేది లేదని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, జస్టిస్ విపుల్? ఎం. పాంచోలిలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం, కోల్‌కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాసిన లేఖను ఊటంకిస్తూ, సోమవారం మధ్యాహ్నం నాటికి దాదాపు 60 లక్షల కేసుల్లో 59.15 లక్షల క్లెయిమ్‌లను జ్యుడీషియల్ అధికారులు పరిష్కరించారని పేర్కొంది. "గతంలో జరిగిన పరిణామాలను పరిగణనలోకి తీసుకుని, బంగాల్ నుంచి కేంద్ర బలగాలను ప్రస్తుతానికి ఉపసంహరించుకోవడం జరగదు. ఒకవేళ రాష్ట్ర యంత్రాంగం విఫలమైతే, తరువాత ఏం చేయాలో మేం ఆలోచిస్తాం" అని సీజేఐ పేర్కొన్నారు. ఇటీవల జ్యుడీషియల్ అధికారులపై ఘెరావ్ చేసిన మాల్దా జిల్లాలో కూడా దాదాపు 8 లక్షల కేసులు పరిష్కారం అయ్యాయని సర్వోన్నత ధర్మాసనం గుర్తించింది. మరోవైపు ఈసీ తరపున హాజరైన సీనియర్ అడ్వొకేట్ డీఎస్ నాయుడు, మిగిలిన క్లెయిమ్‌లను ఈ రోజులోపే పూర్తి చేస్తామని, సోమవారం రాత్రికి అనుబంధ ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని కోర్టుకు తెలిపారు. అయితే పెండింగ్?లో ఉన్న డిజిటల్ సంతకాల అప్‌లోడింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఏప్రిల్ 7 వరకు గడువు కావాలని ఆయన అడగగా, అందుకు కోర్టు అనుమతించింది. మరోవైపు బంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ తరఫున హాజరైన సీనియర్ అడ్వొకేట్ శ్యామ్ దివాన్?, ఓటర్ల తొలగింపు సవాళ్లను విచారణ చేయడానికి ఏర్పాటు చేసిన 19 అప్పీలేట్ ట్రిబ్యునళ్లు ఇంకా పూర్తి స్థాయిలో పనిచేయడం లేదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు, ఈ ట్రిబ్యునళ్ల కోసం ఏకరీతి విధివిధానాలను రూపొందించడానికి ముగ్గురు మాజీ సీనియర్? న్యాయమూర్తులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని కోల్?కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆదేశించింది. అంతేకాదు అప్పీళ్లను వేగంగా పరిష్కరించేందుకు వీలుగా ఏప్రిల్ 7 నాటికి మార్గదర్శకాలను ఖరారు చేయాలని ఆ కమిటీని కోరింది. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులకు గల కారణాలను పరిశీలించే అధికారం సదరు ట్రిబ్యునళ్లకు ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాగే ఆన్?లైన్?లో అప్లోడ్ చేయని డాక్యుమెంటరీ ఆధారాలను కూడా సమీక్షించే అధికారం దానికుంటుందని తేల్చిచెప్పింది. మరోవైపు రివిజన్ ప్రక్రియలో జ్యుడీషియల్ అధికారులకు ఎదురవుతున్న బెదిరింపులు, ఆటంకాలపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. భద్రత కల్పించడంలో రాష్ట్ర యంత్రాంగం విఫలమైతే, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అంతేకాదు, ట్రిబ్యునళ్లు సమర్థవంతంగా, నిష్పక్షపాతంగా పనిచేసే వాతావరణాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం నొక్కి చెప్పింది. ఈ సందర్భంగా, 'ఎన్నికల కమిషన్ పాత్ర ఓటర్ల భాగస్వామ్యాన్ని విస్తరించడమే తప్ప, నియంత్రించడం కాదు' అని జస్టిస్ బాగ్చీ వ్యాఖ్యానించారు.

**మాల్దా ఘటనపై ఎన్ఐఏ దర్యాప్తు**

బంగాల్‌లోని మాల్దా జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ చేపడుతున్న ఏడుగురు జ్యుడీషియల్ అధికారులపై దాడి చేసి, ఘెరావ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసును సుప్రీంకోర్టు సోమవారం 'ఎన్ఐఏ'కు బదిలీ చేసింది. ఇందుకు తనకున్న విశేషాధికారాలను (ప్లీనరీ పవర్స్) ఉపయోగించింది. ఈ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'బంగాల్ బ్యూరోక్రసీ విశ్వసనీయత దిగజారుతోంది. సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాల్లోకి కూడా రాజకీయాలను తీసుకువస్తున్నారు' అని మండిపడింది. మాల్దా ఘటనలో రాష్ట్ర పోలీసులు అరెస్టు చేసిన 26 మంది నిందితులు ప్రస్తుతం జ్యుడీషియల్? కస్టడీలో ఉన్నప్పటికీ, వారిని ఎన్?ఐఏ విచారణ చేయాలని కోర్టు ఆదేశించింది. అంతేకాదు, ఏప్రిల్ 1న జ్యుడీషియల్ అధికారులను ఘెరావ్ చేసిన సమయంలో కోల్?కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన ఫోన్? కాల్స్?ను ఎత్తని బంగాల్? ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దుష్యంత్? నారియాలను సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వెంటనే క్షమాపణ చెప్పాలని చీఫ్? సెక్రటరీని ఆదేశించింది. మాల్దా ఘటన ఏదో యాదృచ్ఛికంగా జరిగింది కాదని, అది ముందస్తు ప్రణాళికతో, దురుద్దేశంతో చేసిన దాడి అని న్యాయస్థానం అభిప్రాయపడింది.

# వారు రాజకీయ ప్రత్యర్థులే తప్ప శత్రువులు కాదు

-మొదటిపేజీ తరువాయి

అభివృద్ధి కార్యక్రమాలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి శంకుస్థాపన చేసిన రేవంత్ రెడ్డి పిప్పిరిలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు.

**వారు రాజకీయ ప్రత్యర్థులే తప్ప శత్రువులు కాదు**

ఆదిలాబాద్‌జిల్లా ప్రజలు అమాయకులే కాదు, నిరంకుశత్వంపై పోరాడినటువంటి వీరులు, కుమురంభీం లాంటి ఆదివాసీ వీరులు నిజాం నిరంకుశత్వంపై పోరాటం చేశారని రేవంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్వాకు ఆధునిక విద్య, వైద్యం లాంటి సదుపాయాలు ఇంకా దక్కలేదని వివరించారు. ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులు తట్టుకుని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పోరాడారని సీఎం తెలిపారు.

ప్రతిపక్ష ఎమ్మెల్యేలను శత్రువులుగా చూసే ప్రభుత్వం తమది కాదని వివరించారు. గతంలో సీఎం వస్తుంటే ప్రతిపక్ష నేతలను అరెస్టులు, గృహనిర్బంధాలు చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకపోయినప్పటికీ, అన్ని నియోజకవర్గాలకు నిధులు ఇస్తున్నామని చెప్పారు. అభివృద్ధి పనుల కార్యక్రమానికి విపక్ష ఎమ్మెల్యేలను కూడా పిలిచామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు తమకు రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే తప్ప శత్రువులు కాదని తెలిపారు.

"జూన్ రెండో తేదీలోగా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి శిలాఫలకం వేసే బాధ్యతను మేమంతా తీసుకుంటాం. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగానే కాకుండా, ఒక పారిశ్రామిక కేంద్రంగా మారుస్తాం. ఆదిలాబాద్? ప్రాంతంలో వేలాది ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద పారిశ్రామికవాడను మంజూరు చేసి ఇక్కడ ఉండే ఆదివాసీ బిడ్డలకు, చదువుకున్న యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇప్పించేందుకు



కృషిచేస్తున్నారు. ఇందుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఆదిలాబాద్?కు యూనివర్సిటీ ఇవ్వడమే కాకుండా, ప్రారంభోత్సవ కార్యక్రమానికి త్వరలోనే నేను వస్తా" -రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

**మండలాలు, జిల్లాల హద్దులు మార్చేది అప్పుడే**

2029 వరకు జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల హద్దులు మార్చవద్దని కేంద్రం చెప్పిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం ఆంక్షలు ఎత్తివేయగానే ప్రజల ఆకాంక్షల మేరకు హద్దులు మారుస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటికే రూ.5,400 కోట్లను పేదల ఖాతాల్లో జమచేశామన్న ఆయన సన్నబియ్యంతో పేదల కడుపు నింపాలనే ఆలోచన గత పాలకులకు వచ్చిందా? అని ప్రశ్నించారు. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తున్న రాష్ట్రం దేశంలో మరొకటి లేదని అన్నారు. యువత మత్తుబాట వదిలి మైదానాల బాట పట్టాలని ప్రయత్నం చేస్తున్నట్లుగా తెలిపారు. ఆదాయం పెంచాలి, పేదలకు పంచాలి అనే ఆశయంతో తమ ప్రభుత్వం పని చేస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. బాసర ఆలయం అభివృద్ధికి రూ.220 కోట్లు మంజూరు చేశామని ఆయన పేర్కొన్నారు. దేశంలోనే గొప్ప సరస్వతి ఆలయంగా బాసరను అభివృద్ధి చేస్తామన్నారు. గూడెం సత్యనారాయణ ఆలయాన్ని కూడా అభివృద్ధి చేస్తామన్నారు.


**ఆదిలాబాద్‌ను అగ్రగామిగా నిల్పుతాం**

విద్యా, ఉద్యోగ, ఉపాధి కల్పనలో ఆదిలాబాద్‌ను అగ్రగామిగా నిలుపుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడని ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని తెలిపారు. అంతకుముందు ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గిరిజన జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్ జిల్లాకి విమానాశ్రం సౌకర్యాన్ని కల్పించి పర్యాటకంగానే కాకుండా పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరిలో నీళ్లు పారిస్తామన్నారు. గూడెం సత్యనారాయణస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం అన్నారు.

# ఏఐతో దోమలను నియంత్రించవచ్చు

-మొదటిపేజీ తరువాయి

బల్దియా సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్?తో దోమలను నియంత్రించేందుకు వినూత్న ప్రయోగం చేపట్టింది. దీనికోసం ఉస్మానియా విశ్వవిద్యాలయం జీవశాస్త్ర విభాగం కూడా తన వంతు సహకారాన్ని అందిస్తూ దోమల నివారణలో కృషి చేస్తోంది. అసలు ఏఐ ద్వారా దోమల నివారణ సాధ్యమేనా, జీహెచ్ఎంసీ చేస్తున్న ఈ ప్రయోగం ఎంత వరకు సఫలీకృతం కావచ్చనే తదితర వివరాలను జీవశాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ రెడ్యా నాయక్? తెలిపారు. ప్రస్తుత ఉన్న పరిస్థితుల్లో ఏఐ ద్వారా దోమలను నివారించవచ్చని ప్రొఫెసర్ రెడ్యా నాయక్ తెలిపారు. ఏఐను ఉపయోగించి దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించవచ్చని, వాటిని నివారించడానికి అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. 3500 రకాలు దోమలు ఉన్నాయని, వీటితో ఎటువంటి హాని ఉండదని స్పష్టం చేశారు. కానీ 3 రకాలు దోమలు ఉన్నాయని, క్యూలెక్స్, ఎడిస్, ఎనాఫిలిస్ దోమలు చాలా ప్రమాదకమని హెచ్చరించారు. వాటి నుంచి జాగ్రత్తలు తీసుకుంటే మనం ఉపశమనం పొందవచ్చని, ఈ దోమలు మురుగునీరు, నిల్వఉన్న నీటిలో వృద్ధి చెందుతున్నాయని వివరించారు. "దోమలను నివారించడానికి ఒక ఏరియాను ఎంపిక చేసుకొని ఫాగింగ్ చేసుకోవాలి. ఆ ఏరియా కవర్ అయ్యేలా ఫాగింగ్ చేయాల్సిన అవసరం ఉంది. మనం ఒక గల్లిలో ఫాగింగ్ చేస్తుంటే దోమలు మరో గల్లికి వెళ్తున్నాయి. ఫాగింగ్ సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల లోపు చేయాలి. మిగిలిన ఏ సమయంలో చేసిన ఫాగింగ్ వల్ల ఏ ఉపయోగం లేదు. దోమలను నివారించడానికి జీహెచ్ఎంసీ పూర్తి సహకారం ఇస్తాం. దోమలను నివారించడానికి నిత్య ప్రణాళికగా కృషి చేయాలి. లేదంటే దోమలు వస్తూనే



ఉంటాయి"

**దోమల వృద్ధిని నివారించబోతున్న జీహెచ్ఎంసీ**

దోమల నియంత్రణపై జీహెచ్ఎంసీ సాంకేతిక అస్త్రాన్ని ఉపోయోగిస్తోంది. ఏఐ ఉపయోగించి దోమల నివారణకు జీహెచ్ఎంసీ కృషి చేయనుంది. ఓయూ జీవశాస్త్ర విభాగంతో కలిసి దోమల నియంత్రణకు ప్రయోగాలు జరుగుతున్నాయి. హైదరాబాద్ నగరంలో 14 రకాల దోమ జాతులను ఓయూ జీవశాస్త్ర విభాగం గుర్తించింది. నగరంలో 60 శాతం క్యూలెక్స్ దోమలు ఉన్నట్లు గుర్తించారు. క్యూలెక్స్ దోమలు మురుగునీరు, నిల్వఉన్న నీటిలో వృద్ధి చెందుతున్నాయి. నగరంలో కొత్తగా మాన్సోనియా దోమజాతి పట్టిందని, ఆర్మీజెరిస్ దోమలు గ్రామాల్లో నుంచి నగరానికి వలస వచ్చాయని అధికారులు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో 27 వేలకుపైగా దోమల హాట్ స్పాట్లను అధికారులు గుర్తించారు. ఏఐ, శాటిలైట్ ఇమేజ్?ల ద్వారా దోమలు వృద్ధి చెందే ప్రాంతాల గుర్తించి, లార్వాను గుర్తించి దోమల వృద్ధిని జీహెచ్ఎంసీ నివారించబోతుంది.

**ఎంటమాలజీ విభాగం పని తీరుపై తీవ్ర విమర్శలు**

ఇంటింటి తనిఖీలు లేకపోవడంతో దోమకాటుతో జనం ఆస్పత్రి పాలవుతున్నారని, ట్రై కార్పొరేషన్ల పరిధిలో ఎంటమాలజీ విభాగం పని తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కార్పొరేషన్ల విభజనతో ఎంటమాలజి సిబ్బంది సరిపడా లేరిని అంటున్నారు. ఎంటమాలజి విభాగంలో గతంలో విధుల్లో 2500 మంది సిబ్బంది ఉన్నారని, డివిజన్ల సంఖ్య 300కు పెరగడంతో ప్రస్తుతం ఎంటమాలజి విభాగంలో అరకొర సిబ్బందే ఉన్నారు.

# సంజయ్‌కుమార్ ఫిరాయింపుతో..

**కరీంనగర్ :** తెలంగాణ రాజకీయాల్లో సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌కు వెన్నెముకలా నిలిచిన మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి పార్టీ మారేందుకు సిద్ధమయ్యారు. 42 ఏళ్ల కాంగ్రెస్ అనుబంధానికి ఇటీవలే స్వస్తి పలికిన రాజకీయ కృరవృద్ధుడు ఇప్పుడు బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమయ్యాడు. జగిత్యాల నియోజకవర్గంలో జీవన్‌రెడ్డి అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే జీవన్‌రెడ్డి అనే రీతిలో రాజకీయం సాగింది. కానీ గత కొంత కాలంగా పార్టీ అంతర్గత పరిణామాలు, అవమానాలు ఆయనను తీవ్రంగా కలిచివేశాయి. దీంతో పార్టీకి గుడ్‌బైయ్ చెప్పాడు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడం జీవన్‌రెడ్డి నిర్ణయానికి ప్రధాన కారణమైంది. ఎన్నికల్లో జీవన్‌రెడ్డి ఓటమి పాలవగా, సంజయ్‌కుమార్ గెలిచారు. అనూహ్యంగా సంజయ్ కాంగ్రెస్‌లో చేరడం, ఆయనకు ప్రభుత్వం, పార్టీలో ప్రాధాన్యత పెరగడం జీవన్‌రెడ్డికి మింగుడుపడలేదు. దీంతో కీలక నిర్ణయం తీసుకుని, గులాబీ కండువా కప్పుకోవడానికి సిద్ధమయ్యారు. దీంతో ఇంతకాలం తిట్టిన గులాబీ పార్టీ నేతలతోనే త్వరలో పొగిడించుకోబోతున్నారు. జీవన్‌రెడ్డి చేరిక తర్వాత జగిత్యాల వేదికగానే బీఆర్ఎస్ ప్లీనరీ నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 27న జగిత్యాల సమీపంలోని వ్యవసాయ భూముల్లో భారీ ఎత్తున ఈ సమావేశం నిర్వహించే యోచనలో అధిష్టానం ఉంది. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న తర్వాత స్పష్టమైన ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ప్లీనరీ సభ వేదిక మీదుగానే కేసీఆర్ జీవన్‌రెడ్డికి అప్పగించే బాధ్యతలను ప్రకటించనున్నారు. జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లోకి వస్తున్న నేపథ్యంలో బలమైన సంకేతాలను పంపించేందుకు ఈ వేదికను వినియోగించుకోవాలని కేసీఆర్ భావిస్తున్నారు. జీవన్‌రెడ్డి చేరికతో జగిత్యాల నియోజకవర్గంలో రాజకీయ



సమీకరణాలు మారనున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్‌కు బలమైన నేతను కోల్పోయినట్లైంది. బీఆర్ఎస్‌కు మాత్రం బలం చేకూరనుంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల అనంతరం పార్టీ అధిష్టానం పట్ల జీవన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. కార్యకర్తలతో సుదీర్ఘ మంతనాల తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారు. జీవన్‌రెడ్డి చేరికతోపాటు, ఆయనకు పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పర్యవేక్షణ బాధ్యతలు ఇవ్వవచ్చని తెలుస్తోంది. కేసీఆర్ హామీతోనే జీవన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జీవన్‌రెడ్డి చేరిక తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు కానుంది. కాంగ్రెస్‌లోని ఇతర అసంతృప్త నేతలు కూడా బీఆర్ఎస్‌వైపు చూసే అవకాశం ఉంది. జగిత్యాల ప్లీనరీ ద్వారా బీఆర్ఎస్ తన బలాన్ని చాటుకోవాలని భావిస్తోంది. 42 ఏళ్ల కాంగ్రెస్ ప్రయాణానికి తెరదించి, గులాబీ గూటికి చేరుతున్న జీవన్‌రెడ్డి నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపింది. జగిత్యాల వేదికగా జరగనున్న ప్లీనరీ ఈ మార్పుకు సాక్ష్యం నిలవనుంది.

## ఇదీ మా అభివృద్ధి..

-మొదటిపేజీ తరువాయి

ఎక్కువ. మా జీఎస్‌డీపీ 16.12 లక్షల కోట్లు దాటింది. దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణ రెండో ర్యాంకులో ఉంది. మా జియోగ్రాఫికల్ ఏరియా దేశంలో 3.5 శాతం. జనాభా తీసుకుంటే 3శాతం కంటే తక్కువ. కానీ, జాతీయ జీడీపీలో తెలంగాణ వాటా దాదాపు 5 శాతంగా ఉంది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రూ.20,617 కోట్ల మేర రైతు రుణాలను మాఫీ చేశాం. 25.36 లక్షల మంది రైతులను రుణ విముక్తుల్ని చేశాం. ఇది తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుంది. వ్యవసాయ రాబడులను పెంచేందుకు రైతు భరోసా కింద.. పంటల సాగుబడికి ఏటా ఎకరాకు రూ.12 వేలు ఇస్తున్నాం. వ్యవసాయ పెట్టుబడి కింద ఇప్పటి వరకు రూ.69.70 లక్షల మంది రైతులకు రూ.25,279 కోట్లు ఇచ్చాం. 24 గంటల ఉచిత విద్యుత్ కోసం 29.40 లక్షల మంది రైతులకు.. రూ.26,098 కోట్లు ఖర్చు చేశాం. 14.91లక్షల మంది రైతులకు రూ.5లక్షలు బీమా కోసం రూ.3,124 కోట్లు ఖర్చు చేశాం. క్రాప్ బోనస్ కింద 14.91 లక్షల మంది రైతులకు రూ.3,139 కోట్లు ఇచ్చాం" అని అన్నారు.

## ప్రజల సంక్షేమం తప్ప.. వ్యక్తిగత ప్రయోజనాలు లేవు

**ఆదిలాబాద్:** అధికారంలోకి వచ్చేందుకు నేతలు ఎన్నో హామీలు ఇస్తుంటారని, కొందరు అధికారంలోకి రాగానే వాటిని మర్చిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తాము అలాంటివాళ్లం కాదన్నారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్‌కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా పిప్పిరిలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పిప్పిరిలో మొదలుపెట్టి ఖమ్మం వరకు పాదయాత్ర చేసినట్లు గుర్తు చేసుకున్నారు. " పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీల అమలుపై జీవోలు జారీ చేశాం. ఇవాళే రూ.1,238 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశాం. ఒకే విడతలో రుణమాఫీ చేసి రూ.22,500 కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. ప్రతి నియోజకవర్గంలో పేదల కోసం 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. తొలి ఏడాదిలోనే మొత్తం 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాం. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం. ఇన్ని పథకాలు, హామీలు ఎలా అమలు చేయగలుగుతున్నారని ఇతర రాష్ట్రాల నేతలు అడుగుతున్నారు. ఈ రాష్ట్రంలో పుట్టడం అదృష్టంగా ప్రజలు భావించే పరిస్థితులు ఉండాలని భావించాం. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వర్తించేలా రూ.5 లక్షలతో ఇందిరమ్మ బీమా పథకం తీసుకొచ్చాం. రైతు కుటుంబాల నుంచి వచ్చిన మాకు పేదల కష్టాలు, అవసరాలు తెలుసు. ప్రజల సంక్షేమం తప్ప.. మాకెవరికీ వ్యక్తిగత ప్రయోజనాలు లేవు" అని భట్టి విక్రమార్క అన్నారు.

## పట్టు బిగిస్తున్న రేవంత్

-మొదటిపేజీ తరువాయి

రోడ్డు షోలలో పాల్గొన్నారు. అక్కడ పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరఫున ఆయన విస్తృతంగా ప్రచారం చేస్తున్కేరళ రాష్ట్రంలో అధికార భాషగా మలయాళం ఉంది. దక్షిణ భారతదేశంలో మలయాళం అనేది అత్యంత క్లిష్టమైన భాష. అందువల్లే రేవంత్ ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో.. ఒక అనువాదకుడిని నియమించుకుంటున్నారు.. "మలయాళ ప్రజలకు నమస్కారం.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయండి. కేరళ రాష్ట్రంలో అభివృద్ధి అంటే ఏంటో కాంగ్రెస్ పార్టీ చూపించింది. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి" అంటూ మలయాళంలో రేవంత్ రెడ్డి పలుకుతున్నారు. ఆ ప్రసంగాలకు సానుకూల స్పందన లభిస్తుంది. రేవంత్ రెడ్డి ఇంగ్లీష్లో.. హిందీలో కూడా మాట్లాడగలిగే నైపుణ్యం ఉన్నవారు కాబట్టి.. ఆ రెండు భాషలలో మాట్లాడుతూ మలయాళ ఓటర్ల మనసు చూరగొనే ప్రయత్నం చేస్తున్నారు. కేరళ ప్రజలకు హిందీతోపాటు ఇంగ్లీష్ కూడా వస్తుంది. అందువల్లే తెలంగాణ సీఎం మాటలకు కాస్త రీచ్ కనిపిస్తోంది.రేవంత్ రెడ్డి తో పాటు శ్రీధర్ బాబు కూడా మలయాళ ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. కేరళ రాష్ట్రంలోని మట్టుతారా నియోజకవర్గంలో రేవంత్ రెడ్డి రోడ్డు షో నిర్వహించారు. అక్కడ బహిరంగ సభ కూడా ఏర్పాటు చేశారు. కేరళ అభివృద్ధికి యుడిఎఫ్ కట్టుబడి ఉందని.. యు డి ఎఫ్ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.. ఇక ప్రచారంలో రేవంత్ రెడ్డి పదేపదే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేస్తున్నారు. కేరళ ముఖ్యమంత్రి విజయన్ పై కూడా విమర్శలు చేస్తున్నారు. మతపరమైన రాజకీయాలను కేరళ ప్రజలు ఒప్పుకోరని.. మతాలపరంగా విడిపోవడానికి సిద్ధంగా ఉండరని రేవంత్ రెడ్డి అంటున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి విజయన్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెరచాటుగా ఒప్పందాలు చేసుకున్నారని.. కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రాకుండా ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు రేవంత్..కాగా, ఈ స్థాయిలో ప్రచారం చేస్తున్నప్పటికీ సర్వేలలో మాత్రం కేరళ రాష్ట్రంలో విజయన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని తెలుస్తోంది. ఎల్డిఎఫ్ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తుందని సర్వేలు చెబుతున్నాయి. అధికారంలోకి వచ్చినప్పటికీ గతంలో మాదిరిగా మెజారిటీ రాదని.. ఈసారి తగ్గే అవకాశం ఉందని తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో ప్రస్తుత ముఖ్యమంత్రి కి తిరుగులేదని.. నగర ప్రాంతాలలో తీవ్రమైన వ్యతిరేకత కనిపిస్తోందని సర్వేలు చెబుతున్నాయి.. సర్వేలలో వచ్చిన నివేదికలను ఒకసారి పరిశీలిస్తే కేవలం 30 శాతం మంది మాత్రమే విజయన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని.. ఇతర వ్యక్తులు ప్రత్యామ్నాయం ఉంటే బాగుంటుందని చెబుతున్నారని తెలుస్తోంది. అయితే మిగతా పార్టీలలో అగ్ర నాయకులు అంత గొప్పగా లేకపోవడం విజయన్ కు కలసి వస్తోంది.

## ఏమౌతోంది... ఐఎఎస్ ఆఫీసర్లు,,,

**కరీంనగర్ :** భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు సీఎం ఓలో ప్రియాంక వర్గీస్, స్మిత సబర్వాల్ కీలక అధికారులుగా ఉండేవారు. వారితోపాటు జయేష్ రంజన్ కూడా ఉండేవాడు. సీనియర్ ఐఏఎస్ అధికారిగా.. అప్పట్లో ఐటీ కార్యకలాపాలను పర్యవేక్షించిన అధికారిగా జయేష్ సుపరిచితుడు. నాడు పరిశ్రమల శాఖ మంత్రిగా.. ఐటీ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ కు అత్యంత సన్నిహితుడిగా ఉండేవాడు.భారత రాష్ట్ర సమితి అధికారం కోల్పోయిన తర్వాత కొద్ది రోజులపాటు రంజన్ ఐటీ కార్యకలాపాలను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెట్టుబడుల సదస్సు కోసం వెళ్ళినప్పుడు రంజన్ కూడా ఆయన వెంట ఉన్నారు. అయితేనాడు కుదుర్చుకున్న ఎం ఓ యు వ్యవహారాలలో లోపాలు ఉన్నాయని భారత రాష్ట్ర సమితి ఆరోపించింది. ఆ ఆరోపణలు తగ్గట్టుగానే ప్రభుత్వ వ్యవహార శైలి ఉండడం ఆందోళన కలిగించింది. చివరికి రంజన్ సెల్ఫీ వీడియో తీసి.. తెలంగాణ ప్రజలకు వివరణ ఇవ్వాల్సి వచ్చింది.ఈ ఉదంతం రంజన్ మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆగ్రహాన్ని కలిగించిందని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత గ్లోబల్ సమ్మిట్ విఫలం కావడంతో రంజన్ వ్యవహార శైలి పై మరోసారి చర్చ జరిగింది. గ్లోబల్ సమ్మిట్ జరిగేటప్పుడు కీలక సమాచారం భారత రాష్ట్ర సమితి చేతుల్లోకి వెళ్ళింది. దీంతో అప్పుడే ప్రభుత్వం అప్రమత్తమయింది. వెంటనే లోతుగా విచారణకు ఆదేశించింది. దీంతో కొంతమంది అధికారులు కావాలని ప్రభుత్వ సమాచారాన్ని ప్రతిపక్ష పార్టీకి అందిస్తున్నారని అందులో తేలింది. ఇక అప్పటినుంచి జయేష్ మీద ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. అతడిని ఐటీ విభాగం నుంచి దూరం చేసింది. ఆ తర్వాత ఇప్పుడు సీఎం ఓ నుంచి కూడా పక్కనపెట్టింది. ఆయనకు క్రీడా శాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది.గతంలో జయేష్ కేటీఆర్ కు దగ్గరగా ఉండటంవల్ల.. కీలకమైన విషయాలు ఆయన ద్వారా ప్రతిపక్ష పార్టీకి తెలుస్తున్నాయని ప్రభుత్వానికి సమాచారం ఉండడం వల్ల.. రేవంత్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జయేష్ కు స్థానచలనం తప్పదని ప్రచారం జరిగింది. అయితే రేవంత్ ప్రభుత్వం కొద్దిరోజులపాటు అతడినే అదే శాఖలో కొనసాగించింది. చివరికి ప్రభుత్వం నుంచి కీలక సమాచారం బయటకు పోతున్న క్రమంలో.. ప్రక్షాళనకు రేవంత్ రెడ్డి నడుం బిగించారు. తన వేగుల ద్వారా సమాచారం తెప్పించుకుని.. సరైన సమయంలో.. సరైన విధంగా వేటు వేశారు. పైకి క్రీడాభివృద్ధి అని చెబుతున్నప్పటికీ .. అసలు అంతరార్థం వేరే ఉందని విశ్లేషకులు అంటున్నారు. మొత్తానికి సీఎంఓ నుంచి జయష్ ను పంపించడం ద్వారా పూర్తిగా ప్రక్షాళన చేసామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. రేవంత్ వచ్చిన తర్వాత ప్రియాంక, స్మిత.. ఇప్పుడు జయేష్ సీఎం ఓ నుంచి బయటికి వెళ్లిపోయారు. స్మిత అనారోగ్యం వల్ల లాంగ్ లీవ్ లో ఉన్నారు.

# సంపాదకీయం

## పోషకాహార లోపం... వ్యాధులకు మూలం

ఈరోజుల్లో అన్నం విలువ కొంత మందికే తెలుస్తుంది. ఎందుకంటే అన్నం తినేవాడి కన్నా దానిని పండించే వారికే దాని యొక్క విలువ తెలుస్తుంది. ఆహారం పారేయడానికి ఒక్క నిమిషం చాలు, కాని ఆ ఆహారాన్ని పండించడానికి కనీసం మూడు నెలలు పడుతుంది. ఆ విషయం తెలియక చాలా మంది దానిని వృధా చేస్తారు. దీనికి సంబందించే అంటే ఆహార భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈరోజున ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ ఆహార దినోత్సవం జరుపుకుంటారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ), ఇతర సంబంధిత సంస్థల ప్రాయోజకత్వంలో జరుపుకునే ప్రపంచ ఆరోగ్య అవగాహన దినం. 1948లో, ఔనూ మొదటి ప్రపంచ ఆరోగ్య సభను నిర్వహించింది. 1950 నుండి ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7 ను జరుపుకోవాలని అసెంబ్లీ నిర్ణయించింది. ఔనూ స్థాపనకు గుర్తుగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరుగుతుంది. ప్రతి సంవత్సరం ప్రపంచ ఆరోగ్యానికి ప్రధాన ప్రాముఖ్యత ఉన్న అంశంపై ప్రపంచవ్యాప్త దృష్టిని ఆకర్షించేటట్లు ఈ సంస్థ చూస్తుంది. ప్రతి ఏటా 150 కంటే ఎక్కువ దేశాలలో ఆహార దినం పాటిస్తున్నారు. ఒకరు రోజంతా కష్టపడి కూలి పనులు చేసి డబ్బు సంపాదిస్తారు. ఇంకొకరు రోజంతా ఏసీ గదుల్లో కంప్యూటర్ల ముందు కూర్చొని కుస్తీ పడతారు. ఎవరు ఎలా కష్టపడినా... కడుపు నింపు కోవడానికే. కోటి విద్యలు కూటి కోరకే... అని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. ముందు కడుపు నిండాకే మనిషి మరో దాని గురించి ఆలోచిస్తున్నాడు. ప్రస్తుతం కనీస అవసరాల కిందకి చాలా వచ్చాయి. ఎన్ని ఆ జాబితాలో చేరినా మొదటి స్థానంలో ఆహారమే ఉంటుంది. ఎందుకుంటే... ఆహారం లేకుండా సృష్టిలో ఏ ప్రాణి జీవించలేదు కాబట్టి. కానీ ప్రస్తుత రోజుల్లో మనుషులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నా కూడా కడుపు నిండా భోజనం చేయడం లేదు. బరువు పెరుగు తామనో, లావు అయి పోతామనో ఇలా కారణాలు చెబుతున్నారు. కొందరేమో తినడానికి తిండి లేక అవస్తలు పడుతున్నారు. ఈ రెండు కారణాల వల్ల పోషకాహార లోపాన్ని ఎదురు కుంటున్న వారు చాలా మంది ఉన్నారు. ఈ రోజు ప్రపంచ ఆహార దినోత్సవం. ఈ సందర్భంగా ఎలాంటి ఆహారం తినాలనే విషయాలపై అవగాహన అవసరం. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఈ ఆహార దినోత్సవం సందర్భంగా ఎలాంటి జబ్బుల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలతో పాటు గింజలు, విత్తనాలు, పల్లీలు, శనగలు, ఉలవలు, బొబ్బర్లు, జీడిపప్పు, బాదం పప్పు, వాల్ నట్స్ వంటిని ప్రతి రోజూ తీసుకోవాలి. భారతీయులు రోజూ కనీసం 400గ్రాముల కూరగాయలు, పండ్లు తీసుకోవాలని భారత పోషకాహార సంస్థ చెబుతోంది. రాగులు, జొన్నలు, వరి, గోధుమ వంటి ధాన్యాన్ని కూడా ఎక్కువగా తీసుకోవాలి. మరీ ప్రత్యేకంగా కొవ్వులు, చెక్కర, ఉప్పు వాడకాన్ని చాలా తక్కువగా వాడటం ఉత్తమం. 50శాతం కేలరీలు అందిస్తున్న పంటలు 8 రకాలు ఉన్నాయి. బార్లీ, బీన్స్, వేరుశెనగ, మొక్కజొన్న, వరి, జొన్న, గోధుమలు వీలైనంత ఎక్కువగా ఆహారంలో భాగం చేసుకోవాలి. బయట లభించే ఆహారాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్ అసలు తినకపోవడం చాలా మంచిది. చిన్నారులకు కనీసం 9నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి. పుట్టగానే డబ్బా పాలను అలవాటు చేస్తే.. అప్పటి నుంచే వారిలో పోషకాహార లోపం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారం తీసుకోవడంతో పాటు తగినంత వ్యాయామం చేయడం కూడా చాలా అవసరం. మన భూమి మీద మనిషి తినగలిగే మొక్కల జాతుల సంఖ్య దాదాపు 30వేలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 852 మిలియన్ల మంది దీర్ఘకాలంగా అతి పేదరికం కారణంగా ఆకలితో అలమటిస్తున్నారు. ఈ సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణాలు అనేకం. విపరీతమైన జనాభా పెరుగుదల, వాతావరణ మార్పు, ఆహార ధాన్యాలను జీవ ఇంధనాల కోసం ఉపయోగించడం, మౌలిక ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గించి లాభదాయకమైన వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపడం... ఇలా ఎన్నో కారణాలు. వీటి పర్యవసానంగా ఆహార ధాన్యాల ధరలు అందుబాటు లోకి లేనంతగా పెరగడం మరో సమస్య. ప్రపంచ జనాభాలో దాదాపు సగం పట్టణాలు, నగరాలలో జీవిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 70 శాతం కంటే ఎక్కువ మంది పల్లెల్లో నివసిస్తున్నారు. అయినా అనేక కారణాలవల్ల వ్యవసాయం కుంటుపడింది. ఆఫ్రికాలో కొన్ని దేశాలలో కరువు నిత్యం తాండవిస్తూనే ఉంది. ఆసియాలో దాదాపు 60 శాతం జనాభా పోషకాహార లోపంతో బాధ పడుతున్నారు. అదే ఆఫ్రికాలో ఆ శాతం 75 దాటింది. దాదాపు 22 దేశాలలో (వాటిలో 16 ఆఫ్రికాలోవే) పోషకాహార లోపం 35 శాతం దాటిందని తేలింది. భారతావనిలో విస్తారమైన కోట్లాది ఎకరాల భూములుండి, లక్షలాది ఎకరాల పంట భూములలో పప్పు ధాన్యాలు, తదితర ఆహార ధాన్యాలతో విలసిల్లింది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన మనదేశం స్వాత్రంత్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, పాలకుల పేదరిక నిర్మూలనా పథకాలు, లక్షల, కోట్ల పంచ వర్ష ప్రణాళికలు ఈ ఏడు దశాబ్దాల్లో పేదరికం ఆకలి తీర్చలేదు. పేదలు దరిద్రులుగా, ధనికులు బిలియనీర్లు, ట్రిలియనీర్లు కావటానికి ఉపయోగపడ్డాయి తప్ప, సగటు మనిషి ఆకలి తీర్చటంలో విఫలమయ్యాయి. దేశ స్థూల జాతీయాదాయం చూపి చంకలు గుద్దుకుంటున్న పాలకులు జాతీయాదాయంతో పాటు, జాతులకు ఆహార భద్రత కల్పించటంలో విఫలమయ్యారు. దీనికి ఉదాహరణ పనికి ఆహార పథకంలో అవినీతి, పేదలకిచ్చే సబ్సిడి ఆహార భద్రత కార్డుల్లో అవినీతి, ఆహార అవసరాలు తీర్చుట గురించి అవకాశం కల్పించినా రైస్‌మిల్లర్ల మాయాజాలం వెరసి అవినీతి ఎందెందు వెతికినా అందందు కలదన్నట్టు అవినీతి బీజాలు మహా వృక్షాలై పాలకుల ప్రజాస్వామ్య వ్యవస్థను వెక్కిరిస్తున్నాయి. వ్యవసాయ రంగానికి ఒక సమగ్ర విధానమంటూ లేకపోవటంతో వ్యవసాయాన్ని సమాధిచేసి, ఉన్న వ్యవసాయంలో వాణిజ్య పంటలను ప్రోత్సహించింది. ప్రపంచ వేదికల్లో గొప్పలకు పోయే మన పాలకుల ఏలికలు వాస్తవ పునాదులపై నిలబడి, మాటల్లో కాకుండా ఆచరణతో కూడిన ఆహార భద్రత పరిష్కారానికి పూనుకోవాలి. అదే జాతీయ ప్రయోజనాలకు,జాతి ప్రయోజనాలకు శ్రేయస్కారం.

# రాళ్ళకు జీవం పోసిన అసమాన శిల్పి గణపతి స్థపతి



శిలలపై శిల్పాలు చెక్కి నారు..మనవాళ్ళు సృష్టికే అందాలు తెచ్చినారు...1962లో విడుదలైన మంచి మనసులు చిత్రంలో, ఆచార్య ఆత్రేయ సాహిత్యం అందించిందిన, పాటకి కె.వి.మహదేవన్ అద్భుతమైన సంగీతం అందించిన, అమర గాయకుడు ఘంటసాల పాడిన పాట గుర్తుకు రాగానే విజయనగర సామ్రాజ్య శిల్పకళకు నెలవైన హంపిలో చిత్రీకరించిన చిత్రాలు కళ్లముందు సజీవంగా సాక్షాత్కారిస్తాయి. అలాగే అమర శిల్పి జక్కన్న కళ్ళముందు కదలడం అత్యంత సహజం. ఆధునిక కాలంలో పలు దేవాలయాలు, అపురూప నిర్మాణాలు చూసినపుడు శిల్ప కళ కు ప్రతిరూపం అయిన గణపతి స్థపతి వెంటనే స్ఫురణకు రాక మానరు. ఉలి చప్పుళ్ల మధ్య ప్రపంచంలో కళ్లు తెరిచి, ఉలి చప్పుళ్లకే జీవితాన్ని అంకితం చేసి, ఉలి చప్పుళ్ల మధ్యే కళ్లుమూసిన వందలాది దేవుళ్లకు వేలాది ఆలయాలను నిర్మించిన, శిల్పీకరించిన గణపతి స్థపతి అసమాన శిల్పి. దేశం గర్వించదగ్గ శిల్పకళా నిపుణులు.గణపతి స్థపతి (26 ఏప్రిల్ 1931 – 7 ఏప్రిల్ 2017) ప్రముఖ స్థపతి, వాస్తు శిల్పి. పూర్తిపేరు సత్తయ్య ముత్తయ్య గణపతి.శ్రీశైలం దేవస్థాన పునరుద్ధరణ, భద్రాచలం రామాలయ మహామండప గోపురాల నిర్మాణంతో గణపతి స్థపతి పేరు తెర మీదకు వచ్చింది.దివంగత ప్రధాని ఇందిరా గాంధీ చేత బంగారు గొలుసు, 60 తులాల డాలర్‌ను బహూకరించప బడి, సత్కరింప బడిన గొప్పతనం ఆయనది. తిరుమలలో వసంతరాయ మంటపాన్ని పునర్నిర్మించి, ఆస్థాన స్థపతి పదవిని దక్కించుకొన్న ప్రతిభ ఆయనది.నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కోరిక మేరకు హైదరాబాద్‌లో హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై 58 అడుగుల ఎత్తు, 350 టన్నుల బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠింప చేసిన ఘనత ఆయనది.1931, ఏప్రిల్ 26న ముత్తు స్థపతి, గౌరీ అమ్మన్ లకు సంతానంగా జన్మించిన గణపతి, ఆరేళ్ల చిరుత ప్రాయంలోనే ఉలిని చేతబట్టి అలవోకగా చెక్కడం అభ్యాసం చేశారు. సాంప్రదాయ ఆలయ, వాస్తు, శిల్ప శాస్త్రాలను, కుటుంబ పెద్దల దగ్గర 17 సంవత్సరాల పాటు శిక్షణ పొందారు. శిల్పాలు చెక్కడం లోనూ, ఆలయాలను నిర్మించటం లోనూ కొత్త ఒరవడిని సృష్టించి, ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తున్న గణపతి తమిళనాడు వదిలి, తెలుగునాట కాలు మోపారు. శ్రీశైలం దేవస్థాన పునరుద్ధరణ, భద్రాచలం రామాలయ మహామండప గోపురాల నిర్మాణంతో పేరు తెచ్చుకొన్న గణపతి స్థపతి నైపుణ్యం గురించి, విన్న నాటి దేశ ప్రధాని ఇందిరాగాంధీ, బద్రీనాథ్ దేవాలయ మహామండప పని అప్పగించారు. మండప భాగాలను హైదరాబాద్‌లో తీర్చిదిద్ది, బద్రీనాథ్‌కు తరలించి నిర్మించిన తీరుకు అచ్చెరువొందిన ఆమె, ఒక బంగారు గొలుసు, 60 తులాల డాలర్‌ను బహూకరించి సత్కరించారు. తిరుమల తిరుపతి దేవస్థానాల పిలుపునందుకొని, తిరుమలలో వసంతరాయ మంటపాన్ని పునర్నిర్మించి, ఆస్థాన స్థపతి పదవిని దక్కించుకొన్నారు.దేవాదాయ, ధర్మాదాయ శాఖలో స్థపతిగా చేరిన గణపతి స్థపతి, ఉమ్మడి రాష్ట్రంలో వందల, వేల ఆలయాలను నిర్మించి, ప్రధాన స్థపతిగా ఎదిగారు. తరతరాల ప్రాచీన వాస్తుశిల్ప సంప్రదాయం, నిరంతరం కొనసాగాలన్న తపనతో, తన ఆధ్వర్యంలో దేవాదాయ శాఖలో ఒక శిల్ప కళాశాలను స్థాపించి, కొన్ని వందల మంది శిల్పుల్ని తయారుచేసి, కొరతను తీర్చారు.రాష్ట్ర వ్యాప్తంగా, శిథిలాలయాలను పదిలం చేస్తూ, లేనిచోట కొత్త వాటిని కడుతూ తలమునకలై ఉన్న గణపతి స్థపతికి శ్రీశైలం జలాశయ నీటి ముంపు దేవాలయాల తరలింపు ఒక సవాలుగా మారింది. కర్నూలు, మహబూబ్ నగర్ జిల్లాల్లోని 102 గ్రామాల్లో ముంపునకు గురైన దాదాపు 108 దేవాలయాలను ఊడదీసి ఎగువన1978--89 మధ్య చారిత్రక కార్యక్రమం చేపట్టి, పునర్నిర్మించిన ఘనతను దక్కించుకొన్నారు. వాస్తు, శిల్ప విద్యను అందుబాటు లోకి తేవడానికి పూనుకుని, తమిళ, సంస్కృత భాషల్లోనున్న వాస్తు, శిల్ప, ఆగమ శాస్త్రాలను తెలుగులోకి అనువదించే కార్యక్రమా నికి శ్రీకారం చుట్టారు. పెదపాటి నాగేశ్వరరావు సహకారంతో రూపధ్యాన రత్నావళి, కాశ్యప శిల్ప శాస్త్రాలను వెలువరిం చారు. నిరంతర అధ్యయనంతో పాటు, పరిశోధనలపై దృష్టి సారించిన గణపతి స్థపతి, తెలుగు విశ్వవిద్యాలయం, సచివా లయం భవనాల్లో ఆధునికతకు, సాంప్రదాయ వాస్తును జోడిం చి, కొత్త ఒరవడిని సృష్టించారు.ఒకసారి అమెరికా వెళ్లిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు, న్యూయార్క్‌లో గణపతి స్థపతి తారస పడిన సందర్భంలో, లిబర్టీ స్టాట్యూ లాంటి పెద్ద విగ్రహాన్ని హైదరాబాద్‌లో నెలకొల్పే ప్రయత్నం చేయాలి అన్న ఎన్టీఆర్ కోరికను సాకారం చేసి, హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై 58 అడుగుల ఎత్తు, 350 టన్నుల బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆ విగ్రహం కోసం యాదగిరి గుట్టకు సమీపంలోని రాయగిరి నుంచి 100 అడుగుల రాయిని, 100 చక్రాల వాహనంపై హైదరాబాద్‌కు తరలించి, గణపతి స్థపతి ప్రపంచ ఖ్యాతిని సంపాదించారు. హైదరాబాద్‌లో బిర్లా మందిర్ రూప శిల్పి ఆయనే. సింహాచలం, కాళేశ్వరం, వేములవాడ లాంటి అనేక ప్రాంతాల్లో పలు ఆలయాలకు కొత్త సొగసులు అద్దారు. శ్రీశైలం, మహానంది ఆలయ గోపురాలను చోళ, విజయనగర శిల్పకళారీతుల కలయికతో నిర్మింప చేశారు. విదేశాల్లో సైతం ఆలయాలను నిర్మించి, తెలుగు శిల్పుల కీర్తిని దశదిశలా విస్తరింప చేయటలో భాగంగా, పిట్స్‌బర్గ్‌లోని బాలాజీ దేవాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయం అమెరికా తిరుపతిగా ప్రసిద్ధి చెంది, రోజూ వేల మంది భక్తులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. గణపతి స్థపతి శిల్పకళా చాతుర్యాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం, 1990లో అత్యున్నత పురస్కారమైన పద్మశ్రీ ద్వారా గౌరవించింది. ఆయన ప్రతిభకు గుర్తింపుగా, శిల్పకళానిధి, కళైమామణి, శిల్పకళా రత్న వంటి బిరుదులెన్నో వరించాయి. వందలాది దేవుళ్లకు వేలాది ఆలయాలను నిర్మించిన గణపతి స్థపతి కంచి కామకోటి పీఠ పరంపరలోని 68వ పీఠాపతులైన శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామికి పరమ భక్తులు. శంకరాచార్య ఆకాంక్ష మేరకు, కంచి సమీపంలో నున్న ఒరుక్కై గ్రామంలో తన అద్భుత శిల్పకల్పనా చాతుర్యంతో మలచిన 100 స్తంభాలతో నిర్మించిన మణి మంటప నిర్మాణం, తన చిరకాల వాంఛగా తరచూ పేర్కొనేవారు గణపతి స్థపతి. శంకరాచార్య ప్రమాచార్య శుభాశీస్సులతో అక్కడే శంకర శిల్పశాలను స్థాపించి, వాస్తు, శిల్ప, ఆగమ శాస్త్రాల్లో విద్యార్థులకు శిక్షణనిస్తూ గణపతి స్థపతి, ఏప్రిల్ 7న, ఈ పార్థివ దేహాన్ని వదిలి వెళ్లారు. ఆ మహాశిల్పి ఈ నేలను వదిలినా, ఆయన సృష్టించిన అపురూప, అపూర్వ శిల్పాలు, నిర్మించిన ఆలయాలు, ఆయన శిల్పకళా ప్రతిబింబాలై కళ్లముందు సజీవంగా కదలాడుతూనే ఉన్నాయి.

# జ్యోతిర్లింగం, శక్తి పీఠం దివ్యక్షేత్రం శ్రీశైలం



తెలుగు నేలపై కొలువైన దివ్యక్షేత్రం శ్రీశైలం. జ్యోతిర్లింగం, శక్తి పీఠం ఒకే గిరి శృంగం మీద వెలసిన పరమ పవిత్ర స్థలంగా భాసిల్లుతున్న క్షేత్రం. పన్నెండు జ్యోతిర్లింగాలలో రెండవది, శ్రీభ్రమరాంబా దేవికి నెలవైన శక్తిపీఠం. శైవక్షేత్రాల్లో తలమానికం. మల్లికార్జున మహాలింగ చక్రవర్తి కొలువై ఉండి, సకల లోకారాధ్యంగా, త్రైలోక్య పూజితంగా విరాజిల్లు తున్నది. సంకల్ప, పూజా సందర్భాలలో శ్రీశైలానికి ఏ దిగ్భాగంలో ఉన్నామో భగవంతునికి తెలియ చేసుకునే సాంప్రదాయాన్ని బట్టి క్షేత్ర ప్రాధాన్యత స్పష్టం అవుతున్నది. పురాణాల్లో వర్ణితమైన ఎనిమిది శృంగాలతో, నలభై నాలుగు నదులు, అరవై కోట్ల తీర్థరాజాలు, పరాశర, భరద్వాజాది మహర్షుల తపోవన సీమలతో, చంద్ర, సూర్య కుండాది పుష్కరిణులతో, లతలు, వృక్ష సంతతులు, అనేక లింగాలు, అద్భుత ఔషధాలు కలిగి శ్రీశైల మల్లన్న దేవుని సన్నిధికి చేర్చే దారి అత్యంత ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.బ్రహ్మగిరి, విష్ణుగిరి, రుద్రగిరి అనే మూడు పర్వతాలకు పాదాభి వందనం చేస్తూ వేదఘోషను ప్రతిధ్వ నింప చేస్తూ, పాతాళగంగ నామాంకిత అయిన కృష్ణవేణీ నది ఈ ప్రదేశంలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్నది. అష్టాదశ పురాణాల్లోనూ భారత రామాయణాది ఇతిహాసా ల్లోనూ శ్రీశైల వైభవం వర్ణించ బడింది. కృతయుగంలో హిరణ్య కశిపుడు శ్రీశైలాన్ని తన పూజా మందిరంగా చేసుకొన్నాడు. పురాణాల ప్రకారం సీతారాములు ప్రతిష్ఠించిన సహస్ర లింగాలు, పాండవులు భక్తితో స్థాపించిన సద్యోజాత లింగం, పంచపాండవ లింగాలు పూజార్హత కలిగి అలరారు తున్నాయి. సంస్కృత, ఆంధ్ర, కన్నడ, మరాఠీ గ్రంథాల్లో ఈ క్షేత్రాన్ని గురించిన వర్ణనలున్నాయి. పలు భాషల కవులు క్షేత్ర ప్రాధాన్యతను అభివర్ణించారు. స్కాంద పురాణంలోని శ్రీశైల ఖండం, ఈ క్షేత్ర మహత్తును వివరిస్తోంది. ఈ క్షేత్ర ప్రశాంతతకు ముగ్ధులైన ఆది శంకరులు కొంత కాలం ఇక్కడ తపస్సు చేసి, శివానంద లహరిని రచించి, మల్లి కార్జునుడికి సమర్పించి, భ్రమరాంబ సన్నిధిలో శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారు. దత్తావతార పరంపరలో భక్తుల పూజలందుకొనే నృసింహ సరస్వతీ స్వామి శ్రీశైల మహత్యాన్ని వివరి స్తూ తన పాదుకల్ని పట్టుకొన్న తంతుడు అనే భక్తుడికి ఈ క్షేత్ర దర్శన భాగ్యాన్ని కలిగించినట్లు గురుచరిత్ర చెబుతోంది. నృసింహ సరస్వతి స్వామి ఇప్పటికీ కదళీవనంలో గుప్తరూపంలో ఉన్నట్లు దత్తాత్రేయ భక్తులు విశ్వసిస్తారు.శ్రీశైల క్షేత్రాన్ని దర్శించి ఇక్కడి మఠాలలో ఉన్న సాధకులు, యోగుల వసతి కోసం క్రీస్తుపూర్వం నుంచి అనేక రాజవంశాలు ఎన్నో దానాలను గావించి నట్లు శిలాశాసనాలు, చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇక్ష్వాకులు, శాతవాహనులు, విష్ణు కుండినులు, పల్లవులు, రాష్ట్ర కూటులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర సామ్రాజ్యాధీశులు, భ్రమరాంబికా సమేతులైన మల్లికార్జునుణ్ణి దర్శించి భక్తుల సౌకర్యాలకు ఎన్నో ఏర్పాట్లు, అశేష వస్తు సంపదలు సమర్పించారు.శ్రీశైలంలో పంచ మఠాలు ప్రాచీన మైనవి. మొదటిదైన ఘంటామఠం – శ్రీశైల ఆలయానికి వాయువ్య దిశగా ఉంది. శివ సాధకుడైన ఘంటాకర్ణ సిద్దేశ్వరుడు తన శిష్యులతో కలిసి దీనిని ఏర్పాటు చేశారు. రెండోదైన విభూతి మఠం, శ్రీకృష్ణ దేవరాయల కాలపు వీరశైవుడైన శాంతి మల్లయ్య అనే వ్యక్తి పేరు మీదుగా ఏర్పడినట్లు పరిశోధనలు వివరిస్తున్నాయి. మూడోదైన రుద్రాక్ష మఠాన్ని మల్లి శంకరస్వామి అనే భక్తుడు నిర్మించాడని తెలుస్తోం ది. ఇక్కడికి వచ్చే భక్తులకు అతడు రుద్రాక్షలను పంచిపెడు తుండేవాడని స్థానికులు చెబుతుంటారు. నాలుగోదైన సారంగ మఠాన్ని సారంగేశ్వరముని నిర్మించాడని చరిత్ర చెబుతోంది. దీనికి సంబంధించిన లిఖిత ఆధారంగా క్రీ.శ.1585 నాటి శాసనం మఠంలో లభ్యమైంది. అయిదోదైన నంది మఠంలో నందికేశ్వరుడు అనే యోగి సుదీర్ఘకాలం జీవించాడు. ఇది ఘంటా మఠానికి వైపు ఉండేది. ఇవే కాకుండా శ్రీశైలంలో పలు మఠాలు ఉండేవి. వాటిలో వీరశైవ సిద్ధాంత భిక్షావృత్తి మఠం ప్రసిద్ధమైంది. క్రీ.శ. 1518లో దీనిని సిద్ధ భిక్షావృత్తి భార్య, శిష్యుడు పర్వతయ్యలు ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. దీనికి చాలాకాలం ముందే 3వ కుళోత్తుంగ చోళుడు ఒక మఠాన్ని క్రీ.శ. 1178-1216 మధ్య కాలంలో ఏర్పాటు చేసినట్టుగా చరిత్ర చెబుతోంది. వటసిద్ధి మఠం, చంద్రమఠం, కమరీ మఠం అనే మఠాలు భక్తులకు అన్నవసతి ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. ఇంకా అనేక మఠాలు పదహారో శతాబ్దికి పూర్వం నుంచే ఇక్కడ ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న శ్రీశైల క్షేత్రంలో ప్రతీ సంవత్సరం చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళ లేదా శుక్రవారాలలో (ఏరోజు ముందుగా వస్తే ఆ రోజు) కుంభోత్సవం జరుగుతుంది. శ్రీ భ్రమరాంబా అమ్మవారికి సాత్విక బలి సమర్పించేందుకు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. భారీగా గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, నిమ్మకాయలు, అన్నరాశి మొదలైనవి అమ్మవారికి బలిగా సమర్పించడం ఈ ఉత్సవ సంప్రదాయం. ప్రసిద్ధమైన ఈ ఉత్సవాలలో అమ్మవారికి జరిగే కుంభోత్సవంను శ్రీశైలములో నివసించే స్థానికులందరూ ఈ ఉత్సవాన్ని తమ ఊరిపండుగ (క్షేత్ర పండుగ) అని భావిస్తారు. ఆ రోజు దాదాపుగా స్థానికులందరూ అమ్మవారిని విధిగా దర్శించుకుంటారు. ఉత్సవం సందర్భంగా అమ్మవారి ఆలయమంతా పలురకాల పుష్పాలతో, నిమ్మకాయదండలతో, వేపమండలతో అలకరించ బడుతుంది.కుంభోత్సవం నాడు ముందుగా అమ్మవారికి ప్రాత: కాలపూజలు, అర్చకస్వాములు నవావరణ పూజ, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ, అష్టోత్తర పూజలు, జప పారాయణలను ఏకాంతములో నిర్వహిస్తారు. అర్చకులు తప్ప ఇతరులెవరూ ఈ పూజలను వీక్షించే అవకాశం ఉండదు. కుంభోత్సవం కారణంగా ఆ రోజు తెల్లవారు జామునుండే అమ్మవారి ఆలయ తలుపులు మూసివేయబడి ఉంటాయి. సాయంకాలం సూర్యాస్తమయం అయిన తరువాతనే అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. చెంచులుగా పిలువబడే ఇక్కడి స్థానిక గిరిజనులు భ్రమరాంబాదేవిని తమ ఆడపడుచుగా, స్వామి వారిని తమ అల్లునిగా భావిస్తారు. అందుకే చెంచులు కుంభోత్సవం తమ ఇంటి పండుగా భావించి, ఆనందోత్సవాలతో ఈ ఉత్సవంలో పాల్గొంటారు. పెద్దసంఖ్యలో గుమ్మడి కాయలు, కొబ్బరి కాయలు, నిమ్మ కాయలు అన్నపు రాశులను శక్తి స్వరూపిణియైన భ్రమరాంబ దేవికి స్వాతికమైన పద్ధతిలో బలిని సమర్పించడమే ఈ ఉత్సవం యొక్క ప్రధాన ఉద్దేశం. అమ్మవారికి కుంభోత్సవం జరుగుతుంటే మరోవైపు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, సర్వదర్శనం నివేదనలు మొదలైనవన్నీ యథావిధిగా జరుప బడతాయి. ఆరోజు స్వామి వారికి ప్రదోషకాల పూజలయ్యాక, పెరుగు కలిపిన అన్నాభిషేకంతో స్వామి వారి మూల మూర్తిని పూర్తిగా కప్పి వేస్తారు. అనంతరం అమ్మవారికి ఉత్తర పూజలు చేసి 9 రకాల పిండివంటలను నివేదించడంతో ఈ ఉత్సవం ముగుస్తుంది.

# మితంగా నూనె.. అమితంగా ఆరోగ్యం!

**ఆరోగ్యమే మహాభాగ్యం: నూనె వాడకం తగ్గిద్దాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం!**

**తక్కువ నూనె - ఎక్కువ ఆరోగ్యం: వంటల్లో నూనె వాడకం తగ్గించే మార్గాలివే!**

**నూనెకు 'చెక్' పెడదాం.. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకుందాం!**

**ఆయిల్ వాడకం తగ్గించాలా? ఈ చిట్కాలు పాటించి చూడండి!**

**వంటల్లో నూనె వాడకం తగ్గించి.. ఫిట్‌గా ఉండండిలా!**



చాలా కూరలు వండటానికి ఉల్లిపాయ, టమాట ముక్కలను నూనెలో వేయిస్తుంటాం. దీంతో వాటికి నూనె బాగా పట్టుకొని అవి ఉడికేదాకా వెయిట్ చేయాల్సి ఉంటుంది. ఇలా నేరుగా కాకుండా వీటిని ముందుగానే పేస్ట్‌లా తయారు చేసుకుంటే నూనె వాడకం తగ్గించవచ్చు. ఉల్లిపాయ, టామోటా ముక్కలను మిక్సీ పట్టి, కూరలు వండేటప్పుడు నూనెలో వేసుకుంటే త్వరగా వేగుతాయి. దీనికి ఆయిల్ కూడా పెద్దగా అవసరం ఉండదు. కూరలో ఆయిల్ వేయకపోతే అది మాడిపోతుంది. అయితే, కొంచెం ఓపిక పడితే ఇక్కడ కూడా నూనె వినియోగాన్ని తగ్గించవచ్చు. స్టవ్‌ను మీడియం ఫ్లేమ్‌లో పెట్టుకుని, కూర ఉడికేటప్పుడు మధ్యమధ్యలో మాడకుండా కొన్ని నీళ్లు చల్లుతూ ఉండాలి. నీళ్లు పోసినప్పుడు ఒకేసారి కాకుండా నెమ్మదిగా కలపాలి. కూరల్లో వివిధ సుగంధ ద్రవ్యాలు కచ్చితంగా వాడుతుంటారు. జీలకర్ర, ధనియాలు, లవంగం, దాల్చినచెక్క వంటివి నూనెలో వేసినప్పుడు అవి ఎక్కువ నూనెను గ్రహిస్తాయి. ఇలా నేరుగా వేయడానికి బదులుగా, ముందుగా వీటిని పొడి చేసుకోవడం లేదా నూనె లేకుండా నేరుగా వేయించుకోవడం మంచిది. డ్రై పాన్‌లో వీటిని వేయిస్తే వాటి అసలు ఫ్లేవర్స్ రిలీజ్ అవుతాయి. వీటిని పొడిగా చేసుకున్నాక కూర వండేటప్పుడు పొడులు వేసుకోవచ్చు. దీంతో తక్కువ నూనెను గ్రహిస్తాయి. పైగా, ఇవి వంటకు మరింత రుచిని అందిస్తాయి.గ్రేవీలా చేసే కూరలకు చిక్కదనం కోసం ఉడికించిన పప్పు, గుమ్మడికాయ గుజ్జు, తురిమిన సొరకాయ గుజ్జు వాడాలి. ఇవి కొవ్వు శాతాన్ని తగ్గించి వంటకు న్యూట్రిషనల్ రిచ్‌నెస్ అందిస్తాయి. పైగా గ్రేవీ చిక్కగా వస్తుంది, ఇందుకు నూనె కూడా పెద్దగా వాడాల్సిన అవసరం లేదు. ఈ నేచురల్ ఎడిటివ్స్‌తో ఫైబర్, విటమిన్లు అందడంతో పాటు కడుపు నిండిన అనుభూతి కలుగుతుంది. చాలా మంది కూర వండాక దానిపై ఒక చెంచా నెయ్యి లేదా నూనె పోసి గార్నిష్ చేస్తుంటారు. అయితే ఇలా ఆయిల్ కాకుండా ఫ్రెష్ హెర్బల్స్, నిమ్మరసం, మసాలా పొడితో గార్నిషింగ్ ట్రై చేసి చూడండి. కొత్తిమీర, కసూరిమేథి, గరం మసాలా వంటివి వేసుకుంటే నూనె అవసరం లేకుండా వంట ఫ్లేవర్ రిచ్‌గా మారుతుంది.

# ఆరోగ్యం జాగ్రత్త! మామిడి పండు తిన్నాక వీటిని ముట్టుకోవద్దు

వేసవి ఆగమనంతోనే మార్కెట్‌లోకి మామిడి పండ్ల రాక మొదలవుతుంది. మన దేశం మామిడి పండ్లకు ఎంతో ప్రసిద్ధి. ప్రపంచంలో మరెక్కడా లభించనన్ని రకాల మామిడి పండ్లు భారత్ లో లభిస్తాయి. అంతేకాదు దేశంలోని మామిడిపండ్లు రకరకాల రుచుల్లో అందుబాటులో ఉంటాయి. ఈ మామిడి పండ్లను నేరుగా తినొచ్చు. జ్యూస్‌లుగా చేసుకుని తాగవచ్చు. మామిడి తాండ్ర, మామిడి కరేలా లాంటి పదార్థాలు తయారు చేసుకుని కూడా తినొచ్చు. అయితే ఈ మామిడిపండ్లు తిన్న తర్వాత ఓ ఐదు రకాల పదార్థాల జోలికి అస్సలు పోవద్దట. ఆ పదార్థాలేమిటో ఇప్పుడు చూద్దాం..మంచి నీళ్లు : మామిడి పండ్లు తిన్న తర్వాత కొంతసేపటి వరకు మంచినీళ్లను అస్సలు తాగొద్దట. అలా చేస్తే ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతుందట. కడపు నొప్పి, అసిడిటీ, కడుపు ఉబ్బరం లాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉన్నదట.



పెరుగు : మామిడి పండు తినగానే పెరుగు తీసుకుంటే శరీరం డీహైడ్రేట్ అవుతుందట. అందువల్ల అలాంటి అలవాటు ఉంటే తక్షణమే మానుకోవాలట. లేదంటే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందట. అంతేగాక చర్మ సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉన్నదట.

కాకరకాయ : మామిడి పండ్లు తిన్న తర్వాత కాకరకాయ తీసుకోవడం కూడా మంచిది కాదట. అలా చేయడంవల్ల వికారం, వాంతులు, శ్వాస తీసుకోవడంలో సమస్యలు వస్తాయట.

ఘాటైన పదార్థాలు : మామిడి పండ్లు తిన్న తర్వాత ఘాటు పదార్థాలుగానీ, కారం పదార్థాలుగానీ తీసుకుంటే ఉదర సంబంధ సమస్యలు, చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉన్నదట. అంతేగాక ముఖంపై మొటిమలు వచ్చే ప్రమాదం కూడా ఉన్నదట.

చల్లటి పానీయాలు : మామిడి పండ్లతోపాటు చల్లటి పానీయాలు తీసుకోవడం కూడా ఆరోగ్యానికి హానికరమట. చల్లటి పానీయాలతో మామిడి పండ్లను తీసుకోవడంవల్ల షుగర్ లెవల్స్ మరింత పెరుగుతాయట.

# అందమైన పాదాల కోసం.. ఇంటి చిట్కాలతో రక్షణ!



ఎండల ఉధృతి పెరుగుతోంది. ఉక్కపోతా ఎక్కువైంది. ఈ కాలంలో చెప్పులపై మరింత జాగ్రత్త పడుతుంటారు. అయితే వేసవిలో ఫుట్‌వేర్‌తో పాటు ఫుట్‌కేర్ విషయంలో కూడా జాగ్రత్త పాటించాలి. ఎందుకంటే ఈ కాలంలో వేడి, చెమట, ఎండ వంటి అనేక కారణాలతో పాదాలు పొడిగా, పగిలిపోయి, సన్‌బర్న్‌కు గురయ్యే ప్రమాదముంది. ఈ సమస్యలను పరిష్కరించుకోవడానికి, పాదాలను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి కొన్ని సింపుల్ టిప్స్ పాటిస్తే సరిపోతుంది. అవేంటో తెలుసుకుందాం.స్క్రబ్బింగ్ వల్ల చనిపోయిన చర్మ కణాలు తొలగి, రక్తప్రసరణ మెరుగవుతుంది. ఇందుకు ఇంట్లో తయారుచేసిన ఫుట్ స్క్రబ్‌ను ఉపయోగించవచ్చు. చక్కెర లేదా కాఫీ పొడిని ఉపయోగించి స్క్రబ్ తయారు చేయవచ్చు. మడమలు, పాదాలకు రెండు వైపులా చర్మం త్వరగా పొడిగా, నలుపు రంగులోకి మారుతుంది. అందుకే ఆ ప్రాంతాలపై దృష్టి పెట్టాలి. మాయిశ్చరైజర్స్‌తో స్క్రబ్ చేసిన తర్వాత, చర్మాన్ని తేమగా, మృదువుగా ఉంచడానికి మాయిశ్చరైజర్ లేదా ఫుట్ క్రీమ్ అప్లై చేసుకోవాలి. తేమను లాక్ చేయడానికి, పొడి చర్మాన్ని వదిలించుకోవడానికి కొబ్బరి నూనె లేదా గ్లిజరిన్ వంటి పదార్థాలు రాసుకోవచ్చు.బయటకు వెళ్లే ముందు హానికరమైన ఖఎ కిరణాల నుంచి రక్షించడానికి కాళ్లకు, పాదాలకు సన్‌స్క్రీన్ అప్లై చేయవచ్చు. వేసవి కాలంలో చల్లటి నీటిలో కొన్ని చుక్కల పుదీనా లేదా టీ ఆయిల్‌ను కలిపి కాళ్లను కాసేపు అందులో నానబెట్టడం మంచిది. ఇలా చేస్తే ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించవచ్చు. ఎప్సమ్ సాల్ట్‌ఎప్సమ్ సాల్ట్‌ను గోరువెచ్చని నీటిలో కలిపి 15-20 నిమిషాల పాటు కాళ్లను నానబెట్టాలి. ఇలా చేస్తే అలసిపోయిన కండరాలు రిలాక్స్ అవుతాయి. ఇన్‌ఫ్లమేషన్ కూడా తగ్గుతుంది.

# తక్కువ నూనెతో కరకరలాడే వంటలు



పండుగలు, ప్రత్యేక రోజు ఏదైన ఉందంటే.. చాలా మంది పిండివంటల్ని చేసుకుని తింటారు. కొన్నిసార్లు మామూలుగా కూడా ఇంట్లో పూరీ, వడ వంటివి చేస్తుంటారు. పిల్లలు ఇష్టంగా తింటారని ఇళ్లలో వడలు, పూరీ, గారెలు తరచూగా బ్రేక్‌ఫాస్ట్, స్నాక్స్‌గా కూడా చేస్తుంటారు. అయితే, పూరీ, వడ, గారెలు వంటివి చేసేటప్పుడు వాటిని ఎక్కువ ఆయిల్‌లో కాల్చాల్సి వస్తుంది. అప్పుడు ఆ వంటకం నూనె ఎక్కువగా పీల్చకుండా ఉండేందుకు కొన్ని ఉపాయాలు ఉన్నాయి. వాటితో ఎక్కువ నూనెతో ఇబ్బంది లేకుండా మీ వంటకాలు ఆయిల్‌ను లైట్‌గా పీల్చుకునే చేసుకోవచ్చు. అలాంటి టిప్స్ ఏంటో ఇక్కడ తెలుసుకుందాం..ఇంట్లో వడలు చేయాలనుకున్నప్పుడు సహజంగానే అవి మొత్తగా ఉండాలని పిండిని మెత్తగా రుబ్బుకుంటారు. కానీ, దీని వల్ల నూనె ఎక్కువగా పీల్చుకుంటాయి. అలా కాకుండా పిండిని నార్మల్‌గా మీడియం రేంజ్‌లో రుబ్బుకోవాలి. అలాగే, ఇక వడలు చేసేప్పుడు నూనె బాగా వేడేక్కిన తర్వాతే వడలు, గారెలు వేసి కాల్చుకోవాలి. తక్కువ వేడిగా ఉన్నప్పుడు వేస్తే అవి నూనెని ఎక్కువగా పీల్చుకుంటాయి. అలా అని మంటను ఎప్పుడు తక్కువ ఫ్లేమ్‌లో పెట్టుకోవటం కూడా చెయొద్దు. ఎక్కువ మంటపెట్టి వడల్ని వేయించుకోవాలి.అయితే, నూనెని మరీ ఎక్కువగా వేడి చేయొద్దు. మీడియం కంటే వేడిగా ఉండాలి. మరీ ఎక్కువ వేడి అయితే గారెలు పై పైన మాడిపోతాయి. లోపల పచ్చిగానే ఉంటాయి. అలాగే, గారెలు కరకరలాడుతూ ఉండాలంటే గారెల పిండిలో కొంచెం సేమ్యా కలపాలి. దాంతో పాటు గారెల పిండి మిక్సీ చేసిన 5 నిమిషాల లోపే గారెలను వేసుకుంటే నూనె పీల్చవు. గారెలు, వడలు, నూనెలో ఫ్రై చేసిన ఏ పదార్థాలనైనా అలానే తినకూడదు. వాటిని కాల్చుకున్న తర్వాత టిష్యూ, బటర్ పేపర్, కిచెన్ టవల్‌లో వేయాలి. అప్పుడే అందులోని నూనె తగ్గుతుంది. దీంతో ఎక్సెస్ ఆయిల్ ఆ పేపర్స్ పీల్చుకుంటాయి. ఈ చిట్కాలు ఫాలో అయితే ఎటువంటి భయం లేకుండా హ్యాపీగా తినవచ్చు.

# వేసవి తాపానికి చలువనిచ్చే అమృతం.. మజ్జిగ!



వేసవిలో చలువ చేసే పదార్థాలకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. మండే ఎండల నుంచి ఉపశమనం పొందడంలో ఇవి చాలా బాగా ఉపయోగపడతాయి. అలా చలువ చేసే పదార్థాల్లో మజ్జిగ ముందు వరుసలో ఉంటుంది. వేసవి తాపం పోవాలంటే ఒక్క గ్లాస్ మజ్జిగ తాగితే చాలు మస్త్ రిలీఫ్ ఉంటుంది. అయితే మజ్జిగను ఎప్పుడూ ఒకటే రీతిలో తాగాలంటే కాస్త బోరింగే. ఇక పిల్లలతై వద్దని ఏడుపు మొహం పెడతారు. అందుకే మజ్జిగను రకరకాల వెరైటీలుగా తాగడంతో పాటు చారులు కూడా చేసుకోవచ్చు. అవి ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకుందాం...

**పుదీనా మజ్జిగ**

కావాల్సిన పదార్థాలు: జీలకర్ర -- టేబుల్ స్పూన్, ధనియాలు -- ముప్పావు టేబుల్ స్పూన్, ఇంగువ -- పావు టీస్పూన్, ఐస్ క్యూబ్స్ -- రెండు, కొత్తిమీర -- కొద్దిగా, పచ్చిమిర్చి -- రెండు, పుదీనా ఆకులు -- అర కప్పు, ఉప్పు -- రుచికి సరిపడా, బ్లాక్ సాల్ట్ -- అర టీస్పూన్, పెరుగు -- ఒకటిన్నర కప్పులు.

తయారీ విధానం: జీలకర్ర, ధనియాలు లో ఫ్లేమ్‌లో వేయించాలి. సగం పైనే వేగినాక ఇంగువ వేసి కలిపి మరికాసేపు వేయించాలి. జీలకర్ర, ధనియాలు మంచి గోల్డెన్ కలర్‌లోకి మారినాక పక్కన పెట్టి చల్లారనివ్వాలి. ఈలోపు కొత్తిమీర సన్నగా తరగాలి. పుదీనా ఆకులను కొలత ప్రకారం తీసుకోవాలి. మిక్సీజార్‌లోకి వేయించిన జీలకర్ర మిశ్రమం, కొత్తిమీర తరుగు, పుదీనా ఆకులు, ఐస్‌క్యూబ్స్, పచ్చిమిర్చి, ఉప్పు, బ్లాక్ సాల్ట్, పెరుగు వేసి వీలైనంత మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. మిశ్రమాన్ని ఓ గిన్నెలోకి తీసుకొని మీగడ లేని పెరుగును వేసి బాగా కలపాలి. తర్వాత కప్పు పెరుగుకు మూడు కప్పుల చొప్పున నీరు పోసుకోవాలి. మరో ఐదు నిమిషాలు బాగా కలిపి చల్లచల్లగా సర్వ్ చేసుకుంటే ఎంతో టేస్టీగా ఉండే పుదీనా మజ్జిగ రెడీ.

**మునక్కాడల మజ్జిగ పులుసు**

కావాల్సిన పదార్థాలు: నాలుగు -- మునక్కాయలు, అరటీస్పూన్ -- పసుపు, రుచికి తగినంత - ఉప్పు, రెండు కప్పులు -- పెరుగు, నాలుగు టీస్పూన్లు -- శనగపిండి, టీస్పూన్ -- అల్లం, నాలుగైదు టేబుల్ స్పూన్లు -- నూనె, అరటీస్పూన్ -- మెంతులు, టీస్పూన్ -- జీలకర్ర, పచ్చిమిర్చి -- పది, కొద్దిగా -- కరివేపాకు, రెండు -- ఉల్లిగడ్డలు, కొద్దిగా -- కొత్తిమీర తరుగు, ఒకటి -- నిమ్మకాయ

తయారీ విధానం: మునక్కాయలను చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. వాటిపై తొక్కను తీసి శుభ్రంగా కడగాలి. వెడల్పాటి గిన్నెలో మునక్కాయ ముక్కలు వేసి, అవి మునిగేంత వరకు నీళ్లు, పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి మునక్కాడలు కాస్త మెత్తబడే వరకు బాగా ఉడికించుకొని పక్కన పెట్టుకోవాలి. మరో పెద్ద గిన్నె తీసుకుని అందులో కాస్త పుల్లగా ఉండే పెరుగు, శనగపిండి వేసుకుని విస్కర్‌తో ముద్దలు లేకుండా బాగా మిక్స్ చేసుకోవాలి. తర్వాత అందులో మూడు కప్పుల నీళ్లు పోసుకుని మరోసారి బాగా కలపాలి. ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టి ఆయిల్ వేడి చేసి అందులో మెంతులను వేసి దోరగా ఫ్రై చేయాలి. తర్వాత ఆవాలు, జీలకర్ర వేసి వేయించాలి. తర్వాత పచ్చిమిర్చి చీలికలు, కరివేపాకు, కొద్దిగా అల్లంపేస్ట్‌ను వేసి పచ్చివాసన పోయేంత వరకు ఫ్రై చేయాలి. అనంతరం ఉల్లిగడ్డ తరుగు వేసి దోరగా వేయించుకోవాలి. అందులో ముందుగా ఉడికించి పక్కన పెట్టుకున్న మునక్కాడలను వాటర్ వడకట్టి వేసుకుని ఆయిల్‌లో రెండు మూడు నిమిషాలు కలుపుతూ ఫ్రై చేసుకోవాలి. అందులో మజ్జిగ మిశ్రమం, మునక్కాడలు ఉడికించుకున్న నీళ్లను కూడా వేసుకుని బాగా కలుపుకోవాలి. తర్వాత స్టవ్‌ను మీడియం ఫ్లేమ్‌లో ఉంచి మధ్యమధ్యలో కలుపుతూ ఏడెనిమిది నిమిషాలు ఉడికించుకోవాలి. అది బాగా మరిగి బుడగలు వస్తున్నపుడు కొద్దిగా కొత్తిమీర తరుగును వేసి, నిమ్మరసాన్ని పిండి ఓసారి కలిపి స్టవ్ ఆఫ్ చేసుకుంటే చాలు. అంతే కమ్మని మునక్కాడ మజ్జిగ పులుసు రెడీ అవుతుంది!

**సొరకాయ మజ్జిగ చారు**

కావాల్సిన పదార్థాలు: పెరుగు -- 600 ఎంఎల్, ఒకటిన్నర కప్పులు -- సన్నని పచ్చికొబ్బరి ముక్కలు, టేబుల్ స్పూన్ -- ఆవాలు, ఒకట్రెండు టేబుల్ స్పూన్లు -- బియ్యం, నాలుగైదు -- పచ్చిమిర్చి, టీస్పూన్ -- మిరియాలు, అల్లం -- అంగుళం ముక్క, సొరకాయ -- ఒకటి, రెండు రెమ్మలు -- కరివేపాకు, రుచికి సరిపడా -- ఉప్పు, పిడికెడు -- కొత్తిమీర తరుగు.

తయారీ విధానం: ముందుగా ఒకటిన్నర కప్పుల పచ్చికొబ్బరిని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. అందులో మిరియాలు, ఆవాలు, సన్నని అల్లం ముక్కలు, బియ్యం, పచ్చిమిర్చి తుంపలు వేసుకొని తగినన్ని నీళ్లు పోసి అరగంట నానబెట్టుకోవాలి. ఈలోపు సొరకాయ చెక్కు తీసి పెద్ద పెద్ద ముక్కలుగా కోయాలి. అందులో ఎనిమిది కప్పుల మంచి నీళ్లు, కరివేపాకు, రుచికి తగినంత ఉప్పు వేసి కలపాలి. మీడియం ఫ్లేమ్‌లో సొరకాయ ముక్కలు సాఫ్ట్‌గా మారేంత వరకు ఉడికించుకోవాలి. మరీ మెత్తగా మగ్గించకూడదు. ఈలోపు నానబెట్టుకున్న పచ్చికొబ్బరి మిశ్రమాన్ని మెత్తని పేస్ట్‌లా పట్టి పక్కనుంచాలి. సొరకాయ ముక్కలు ఉడికిన తర్వాత అందులో పచ్చికొబ్బరి పేస్ట్ వేసి బాగా కలపాలి. స్టవ్‌ను హై-ఫ్లేమ్‌లో ఉంచి రెండు పొంగులు వచ్చేంతే వరకు మగ్గించుకొని దించి చల్లారనివ్వాలి. ఈలోపు ఒక గిన్నెలో పుల్లని పెరుగును తీసుకుని విస్కర్‌తో ఉండలు లేకుండా బాగా చిలికి కొన్ని నీళ్లు పోసి పలుచగా చేయాలి. దీన్ని చిలికిన సొరకాయ మిశ్రమంలో పోసుకోవాలి. అలాగే సన్నని కొత్తిమీర తరుగు, మూడు నుంచి నాలుగు కప్పుల వరకు నీళ్లు పోసి బాగా కలుపుకొని తాలింపు వేసుకుంటే సరి.

**పాలకూర కాంబోలో**

కావాల్సిన పదార్థాలు: పాలకూర -- రెండు కట్టలు, నూనె -- రెండు టేబుల్ స్పూన్లు, తాలింపు గింజలు -- టీస్పూన్, ఎండుమిర్చి రెండు, వెల్లుల్లి రెబ్బలు -- మూడు, కరివేపాకు -- రెండు రెమ్మలు, పసుపు -- అర టీస్పూన్, పచ్చిమిర్చి -- రెండు, ఇంగువ చిటికెడు, ఉప్పు -- రుచికి సరిపడా, కారం -- టీస్పూన్, పెరుగు -- కప్పు, ఉల్లిగడ్డ -- ఒకటి, కొత్తిమీర తరుగు -- కొద్దిగా.

తయారీ విధానం: పాలకూర శుభ్రంగా కడిగి సన్నగా తరిగి పక్కన ఉంచాలి. అదే విధంగా ఉల్లిగడ్డ, పచ్చిమిర్చిని సన్నగా, పొడుగ్గా కట్ చేసుకోవాలి. కొత్తిమీర, వెల్లుల్లి రెబ్బలను సన్నగా తరగాలి. పాన్‌లో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర చిట్లినాక ఎండుమిర్చి, వెల్లుల్లి తరుగు, కరివేపాకు వేసి ఫ్రై చేయాలి. తర్వాత పచ్చిమిర్చి చీలికలు, ఇంగువ, పాలకూర తరుగు, రుచికి సరిపడా ఉప్పు, పసుపు వేసి కలిపి మీడియం ఫ్లేమ్‌లో మగ్గించాలి. పాలకూర నూనెలో సరిగ్గా వేగినాక కారం వేసి కలిపి మరికాసేపు వేయించాలి. కారం కూడా మగ్గినాక స్టవ్ ఆఫ్ చేసి పూర్తిగా చల్లారనివ్వాలి. ఈలోపు మరో గిన్నెలోకి చిక్కటి పెరుగు, అర కప్పు నీళ్లు పోసి ఉండలు లేకుండా కలుపుకోవాలి. చల్లారిన పాలకూర మిశ్రమంలోకి కలిపి పెట్టుకున్న పెరుగును వేసి బాగా కలపాలి. చివరగా కట్ చేసిన ఉల్లిగడ్డ, కొత్తిమీర తరుగు వేసి మిక్స్ చేసుకుంటే ఎంతో టేస్టీగా ఉండే పాలకూర పెరుగు పచ్చడి రెడీ.

# నూతన విద్యా సంవత్సరంగాను ముందస్తు విద్యార్థుల నమోదుకై ర్యాలీ

**ప్రధానోపాధ్యాయులు గంగిశెట్టి మహేందర్.**




**హుస్నాబాద్ :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గంగిశెట్టి మహేందర్ ఆధ్వర్యంలో వచ్చే విద్యా సంవత్సరం గాను ముందస్తు విద్యార్థుల నమోదుకై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 11వ,వార్డు 15వ వార్డు 17వ వార్డులో పర్యటించడం జరిగింది. 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురుకుల పాఠశాలలకు తీసిపోని సౌకర్యాలు ఉన్నాయని, అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. 17వ, వార్డు కౌన్సిలర్ గాదపాక రవీందర్ మాట్లాడుతూ పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హుస్నాబాద్ మండలంలో అత్యుత్తమ మైన ప్రమాణాలతో అన్ని సౌకర్యాలతో ఉన్న ఏకైక పాఠశాల అని అన్నారు. ప్రజలందరూ వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపి ఆర్థిక భారం పెంచుకోవడం తప్ప ఏమీ లేదని, అన్ని సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చి ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలని అన్నారు. 15వ,వార్డు కౌన్సిలర్ ఆకుల రజిత వెంకన్న మాట్లాడుతూ పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆధునాతనమైన సైన్స్ ల్యాబ్, ఐటి/ఐటిఈఎస్, ఆటోమోటివ్ లాంటి ఏ పాఠశాలలో లేని ఒకేషనల్ కోర్సు, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఉచిత విజ్ఞాన యాత్ర, ఇండస్ట్రియల్ టూర్స్, కరాటే, యోగ, ఉచిత నోట్ బుక్స్,టెక్స్ట్ బుక్స్, యూనిఫామ్,రుచికరమైన మధ్యాహ్న భోజనం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్య బోధన,పరిశుభ్రమైన డైనింగ్ హాల్, మినరల్ వాటర్, డిజిటల్ క్లాసెస్, స్పోర్ట్స్,ప్రతి సంవత్సరం విద్యార్థులకు సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్స్, లైఫ్ స్కిల్స్ ట్రైనింగ్స్ తోపాటు పిల్లల సమగ్ర అభివృద్ధికి తోడ్పడే వసతులు కేవలం పిఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోనే ఉన్నాయని అలాగే రాబోయే సంవత్సరం విద్యార్థులకు ప్రభుత్వం ఉదయం అల్పాహారం షూ,టైస్, బెల్ట్స్, అందజేస్తుందని ఇన్ని సౌకర్యాలు ఉన్న పాఠశాలల లో మీ యొక్క పిల్లలను చేర్చి ప్రభుత్వం కల్పించే అన్ని వసతులను ప్రజలు వినియోగించు కోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు జి.నరేందర్ పి లక్ష్మయ్య ఎస్ రవీందర్ పి రాజయ్య వి.యుగంధర్ రెడ్డి, బి.మనోహర్, జి.రవీందర్, సత్య నారాయణ రెడ్డి,ఎం. వనమాల, కే.శ్వేత టి.నవీన్ కుమార్ ఏ.రేణుక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జెకె -5 ఓసీ కొనసాగించి నిర్వాసితులకు న్యాయం చేయాలి

**జాయింట్ కలెక్టర్ ను కలిసిన సర్పంచ్‌లు, అఖిలపక్ష కమిటీ సభ్యులు**

**పూర్తిస్థాయిలో న్యాయం జరిగినాడే ఖాళీ చేస్తాం**



**కొత్తగూడెం సింగరేణి :** ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి ఇల్లందు ఏరియాలో గల జెకె -5 ఉపరితల బొగ్గుగనిని కొనసాగింప చేసి నిర్వాసితులకు న్యాయం చేయాలని ఆ ప్రాంత నిర్వాసితులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీన్ వెన్స్ డే లో విజయలక్ష్మి నగర్ తిలక్ నగర్ సర్పంచులు వినతి పత్రాన్ని అందజేశారు. పూర్తిస్థాయిలో న్యాయం జరిగిన నాడే ఆ స్థలాలను ఖాళీ సర్పంచులు చాందవ రమేష్ బాబు, ధనసరి స్రవంతి, ఆధ్వర్యంలో 21 అఖిలపక్ష కమిటీ నాయకులు జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ ని కలిసి కోరారు. కాగా తమ ముత్తాతలు, తాతలు , తండ్రులు సింగరేణి కి సేవలందించి రిటైర్అయి ఇక్కడే నివాసం ఉంటున్న మమ్మల్ని తక్షణమే ఖాళీ చేయాలని అధికారుల ఆదేశాలు ఇవ్వడం సరైంది కాదని ఆ వినతిపత్రం పేర్కొన్నారు. అంతేగాక ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా వెంటనే ఖాళీ చేయాలని సింగరేణి యాజమాన్యం తమపై ఒత్తిడి తీసుకొచ్చి భయభ్రాంతులకు గురి చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా తక్షణమే ఈ సమస్యపై స్పందించి తమకు న్యాయం చేయాలని వారు జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ ని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ లు, అఖిలపక్ష కమిటీ నాయకులు ఓసీ విషయం పై జాయింట్ కలెక్టర్ కు వివరిస్తూ దాదాపు 130 ఏళ్ల తరబడి నివాసం ఉంటున్నామని పేర్కొన్నారు. అయితే ఇక్కడున్న ప్రజలందరూ మాజీ కార్మికుల కుటుంబ సభ్యులేనని, ఆనాడు సింగరేణి కి సేవలు అందించి,ఎటు వెళ్లలేని పరిస్థితిలో ఇక్కడే నివాసముండిపోయామని ఆ వినతిపత్రంలో వివరించారు. దాదాపు 20, 30 సంవత్సరాల నుండి ఈ ప్రాంతాలను సింగరేణి ఎలాంటి అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యానికి గురి చేసిందని, ప్రాజెక్టు కోసమని మా స్థలం మాకు కావాలని దౌర్జన్యానికి పాల్పడుతుందని వాపోయారు. జెకె 5 ఓ సి కొనసాగింపులో భాగంగా 21 ఫిట్ ఏరియా నిర్వాసిత ప్రాంతాలైన విజయలక్ష్మి నగర్,ఇతర ప్రాంత ప్రజలను ఉన్నపలంగా ఖాళీ చేయాలని ఎలాంటి నోటీసులు లేకుండా తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఎలాంటి సమాచారం లేకుండా ఖాళీ చేయమని సింగరేణి అధికారులు ఇంటింటికి తిరుగుతూ చెబుతున్నారని తెలిపారు. దీనికి సంబంధించి గతంలోని చట్ట ప్రకారం మాకు రావలిసినవి ఇవ్వాలి అని అఖిలపక్షం చేపిందని వివరించారు. అంతేగాక నిర్వాసితులకు రావాల్సిన నష్టపరిహారాన్ని ఇచ్చిన తర్వాతనే ఖాళీ చేస్తామని స్పష్టంగా సింగరేణి యాజమాన్యానికి తెలియజేయడం జరిగిందని కలెక్టర్కు అందించిన వినతిపత్రంలోపేర్కొన్నారు.సింగరేణి అధికారులు అఖిలపక్ష కమిటీ వద్దకు వచ్చి సహకరించాలని కోరినప్పటికీ మేము ప్రాజెక్టు స్వాగతిస్తూనే ప్రజలకు న్యాయం చేయాలని ప్రార్థించామని తెలిపారు. అంతేగాక గతంలో చెప్పిన కొన్ని డిమాండ్లను వారు అంగీకరించి మా సహకారంతో సర్వే మొత్తం పూర్తి చేసుకొని ఈరోజు ఆ మాటలను తుంగలో తొక్కి వెంటనే ఖాళీ చేయాలని హుకుం జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమ న్యాయమైన డిమాండ్లు ఇలా ఉన్నాయి. జెకె 5 ఓసీ లో ఏదైతే నిర్వాసితులకు ఇచ్చిన విధంగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని జెకె 5 ఉపరితలం గని కొనసాగింపులో నిర్వాసితులకు ఉన్న ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. అంతేగాక నిర్వాసిత కుటుంబంలోని ప్రతి వ్యక్తికి న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఇచ్చిన విధంగా అన్ని సదుపాయాలని సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేయాలన్నారు. నూతన ఇల్లు కట్టే వరకు నిర్వహస్థితులకు అకామిడేషన్ ఇప్పించాలన్నారు. రెండు గ్రామ గ్రామపంచాయతీలను దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని కోరారు. గ్రామపంచాయతీలో నివాసం ఉంటున్న సొంతిల్లు కట్టుకున్న ప్రజలకు రెవెన్యూ కు అప్పగించి పట్టాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి కోటర్స్ ను నివాసముంటున్న ప్రజలకు అప్పజెప్పి అదే విధంగా సింగరేణి కరెంటు తీసి ప్రభుత్వ కరెంటు ఇచ్చే విధంగా సహకారం అందించాలని జాయింట్ కలెక్టర్ కి వివరించారు. దీంతో జాయింట్ కలెక్టర్ పూర్తి వివరాలతో రావాలని సింగరేణి అధికారులకు లెటర్ పంపిస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు తాండ్ర నాగరాజు, ఎట్టి హరికృష్ణ, వడ్రల శ్రీను, క్లింట్ రోచ్, తేజవత్ లాలు,సదారం చిన్నారి, ధనసరి రాజు, బానోత్ హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# పిఎం సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజనను సద్వినియోగం చేసుకోవాలి




**భద్రాద్రి :** సోమవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజన పథకంపై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజనను జిల్లాలో అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం ద్వారా ఇళ్ల పైభాగంలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని, స్వయం విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని తెలిపారు.సోలార్ విద్యుత్ వినియోగం పర్యావరణ పరిరక్షణకు దోహదపడటంతో పాటు కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు . అదనంగా, వినియోగించని విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి తిరిగి ఆదాయం పొందే అవకాశాన్ని ఈ పథకం కల్పిస్తుందని తెలిపారు.దేశవ్యాప్తంగా ఒక కోటి కుటుంబాలకు ప్రతి నెల 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం ఈ పథకం లక్ష్యమని వెల్లడించారుసబ్సిడీ వివరాలను తెలియజేస్తూ, 2 కిలోవాట్ వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.30,000, 3 కిలోవాట్ మరియు అంతకంటే ఎక్కువ సామర్థ్యంపై అదనంగా రూ.18,000 సబ్సిడీ అందించబడుతుందని తెలిపారు.పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, విద్యుత్ బిల్, బ్యాంక్ పాస్‌బుక్, ఫోటో అవసరమని తెలిపారు. అర్హులైన వినియోగదారులు అధికారిక వెబ్‌సైట్ జూఎబబీతీఎజీణష్ట్రజీతీ.ఱనీల.తిని లో నమోదు చేసుకుని రాష్ట్రం, విద్యుత్ పంపిణీ సంస్థ, కస్టమర్ నంబర్ తదితర వివరాలను నమోదు చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా మేనేజర్ పి. అజయ్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ పై పోరాటం

**కరీంనగర్ :** డంపింగ్ యార్డ్ ఏర్పాటు అంటే ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించారు. హుజురాబాద్ పట్టణంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. జేఏసీ (ఏంఅ) ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటల నుండి బుధవారం ఉదయం 10 గంటల వరకు 24 గంటల పాటు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ డంపింగ్ యార్డ్ వల్ల వచ్చే ముప్పు కరోనా వైరస్ కంటే ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఈ పోరాటం ఏ ఒక్కరి కోసమో కాదని, మన ప్రాంత ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తు తరాల మనుగడ కోసం చేస్తున్న పోరాటమని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా హుజురాబాద్ నియోజకవర్గంలోని ప్రతి అక్క, చెల్లి, అన్న, తమ్ముడు, వృద్ధులు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ దీక్షను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వ్యాపారులు, రైతులు, కూలీలు మరియు అన్ని కుల సంఘాలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.హుజురాబాద్ పట్టణం లో రేపు డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఏంఅ ఆధ్వర్యంలో 7/03/26/ ఉదయం 10గంటల నుండి 8/03/26 ఉదయం 10గంటల వరకు 24 గంటల నిరాహార దీక్ష చేయబోతున్నాను.
నిరసన కార్యక్రమం అత్యంత శాంతియుతంగా జరగాలని సూచించారు. సామాన్య ప్రజలకు లేదా ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కార్యకర్తలకు కౌశిక్ రెడ్డి సూచించారు. ప్రజలందరూ ఐక్యంగా పోరాడితేనే ప్రభుత్వానికి బలమైన సందేశం వెళ్తుందని, తద్వారా డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా ఒత్తిడి తీసుకురావచ్చని ఆయన స్పష్టం చేశారు.హుజూరాబాద్ పట్టణంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి వచ్చే చెత్తనంతటినీ హుజూరాబాద్‌కు తీసుకురావాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇతర ప్రాంతాల వ్యర్థాలను తమ ప్రాంతంపై రుద్దడం అన్యాయమని, అసలు హుజూరాబాద్ ప్రజలు చేసిన తప్పేంటని ఆయన ప్రశ్నించారు.ప్రభుత్వానికి తన మీద వ్యక్తిగత కోపం ఉంటే తనపై చర్యలు తీసుకోవాలని, కానీ ఆ నెపంతో హుజూరాబాద్ ప్రజలను శిక్షించవద్దని ఆయన కోరారు. ఇతర జిల్లాల చెత్తను ఇక్కడ వేయాలని చూడటం సరికాదని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను రద్దు చేయాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు.

## భూపాలపల్లిలో దారుణం

**వరంగల్ :** భూపాలపల్లి జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. తండ్రి వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే ఆగ్రహంతో కన్న కొడుకులే అతడిని హతమార్చారు. జిల్లాలోని రేపాక గ్రామానికి చెందిన కుర్రే చేరాలు (55) ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయాడు. ఆదివారం ఉదయం ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది.చేరాలుకు భార్య, కవల కుమారులు రామ్, లక్ష్మణ్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుమారు 25 ఏళ్ల క్రితం చేరాలు తన గ్రామానికే చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయంపై కుటుంబంలో గొడవలు జరగడంతో, పదేళ్ల క్రితం ఆయన తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. ఇటీవల చేపల చెరువు లీజు వ్యవహారంపై పది రోజుల క్రితం తిరిగి గ్రామానికి వచ్చి మళ్లీ పాత ప్రియురాలి ఇంట్లోనే ఉండటం మొదలుపెట్టాడు.మూడు రోజులుగా తండ్రి ఫోన్లకు స్పందించకపోవడంతో అనుమానం వచ్చిన కుమారులు రామ్, లక్ష్మణ్ శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి రేపాకకు చేరుకున్నారు. ప్రియురాలి ఇంట్లో ఉన్న తండ్రిని చూసి ఆగ్రహంతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన చేరాలు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు.శనివారం అర్ధరాత్రి కొడుకులు గొడ్డలితో దాడి చేశారని, అడ్డువచ్చిన మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కొని పారిపోయారని పోలీసులు పేర్కొన్నారు. అయితే, కొడుకులు కోపంతో తండ్రి తలపై బలంగా మోదడంతోపాటు కడుపులో పిడిగుద్దులు గుద్దడంతోనే తీవ్రంగా గాయపడ్డాడని, వారే ఆసుపత్రికి తరలించారని గ్రామస్థులు అంటున్నారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు కుర్రే కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## త్వరలో తులం బంగారం హామీ

**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై రాజకీయ దుమారం కొనసాగుతున్నవేళ... రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వానికి రెండున్నరేళ్లు పూర్తవుతున్న తరుణంలో, ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. ఒక యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన, ఇప్పటికే మెజారిటీ హామీలను అమలు చేశామని, మిగిలినవన్నీ ఈ ఐదేళ్ల పదవీ కాలంలోనే నూటికి నూరు శాతం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా తులం బంగారం హామీని కూడా త్వరలోనే నెరవేరుస్తామని హామీ ఇచ్చారు.బీఆర్ఎస్ పార్టీ కావాలనే '420 హామీలు' అంటూ ప్రజలను పక్కదారి పట్టిస్తోందని, వారి జిమ్మిక్కులను ప్రజలు నమ్మరని మంత్రి ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం ప్రాక్టికల్‌గా ఉంటూ ఆచరణాత్మక పథకాలను రూపొందిస్తోందని, కొద్దిగా ఆలస్యమైనా ప్రతి మాటనూ నిలబెట్టుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య విభేదాలు ఉన్నాయనే ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. సీఎం ఒక కెప్టెన్‌లా అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారని, కేబినెట్ అంతా ఐక్యంగా ఉందని క్లారిటీ ఇచ్చారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ పార్టీని సమర్థవంతంగా నడిపిస్తున్నారని అన్నారు. అభివృద్ధిని అడ్డుకోవద్దని ప్రతిపక్షాలకు హితవు పలికారు.

## మందుబాబుల డిజిటల్ స్కెచ్

**కరీంనగర్ :** గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో మందుబాబులు వేసిన ఒక మాస్టర్ ప్లాన్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ అయింది. పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల నుండి తప్పించుకోవడానికి వీరు ఏకంగా ఒక వాట్సాప్ గ్రూప్‌నే ఆయుధంగా మార్చుకున్నారు. కానీ ఒక్క చిన్న తప్పుతో ఆ గ్రూప్ గుట్టు రట్టవ్వడమే కాకుండా స్వయంగా ఎస్ఐ ఆ గ్రూప్‌లో ఎంట్రీ ఇచ్చి చుక్కలు చూపించారు. నిత్యం పోలీసుల తనిఖీలతో విసిగిపోయిన గోదావరిఖని మందుబాబులు ఒక వినూత్న ఆలోచన చేశారు. పోలీసు మామల స్క్వాడ్ పేరుతో ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసుకున్నారు. ఇందులో ఏకంగా వెయ్యి మందికి పైగా సభ్యులు చేరారు. పారిశ్రామిక ప్రాంతంలో ఎక్కడ పోలీసులు తనిఖీలు చేపట్టినా వెంటనే ఆ లొకేషన్ వివరాలను గ్రూప్‌లో షేర్ చేసేవారు. దీంతో మిగతా మందుబాబులు ఆ రూట్‌లో వెళ్లకుండా దారి మళ్లించి సేఫ్‌గా ఇంటికి చేరుకునేవారు.ఈ గ్రూప్ వ్యవహారం సాఫీగా సాగిపోతున్న తరుణంలో ఒక ఆటో డ్రైవర్ మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ ట్రాఫిక్ ఎస్ఐ హరిశంకర్ కంటపడ్డాడు. తనిఖీల్లో భాగంగా ఎస్ఐ ఆ ఆటో డ్రైవర్ సెల్ ఫోన్‌ను పరిశీలించగా.. అందులో ఈ పోలీసు మామల స్క్వాడ్ గ్రూప్ దర్శనమిచ్చింది. గ్రూప్ చాటింగ్ చూసిన ఎస్ఐకి మందుబాబుల నెట్‌వర్క్ చూసి మైండ్ బ్లాక్ అయింది. వెంటనే ఎస్ఐ హరిశంకర్ ఒక అడుగు ముందుకు వేసి, అదే గ్రూప్‌లో తాను కూడా జాయిన్ అయ్యారు. నేరుగా గ్రూప్ సభ్యులందరికీ వీడియో కాల్ చేసి లైవ్‌లోనే భారీ క్లాస్ పీకారు. స్క్రీన్ మీద ఎస్ఐ ముఖం కనిపించగానే గ్రూప్ సభ్యుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. భయంతో సభ్యులందరూ ఒక్కొక్కరుగా గ్రూప్ నుండి ఎగ్జిట్ అవ్వడం మొదలుపెట్టారు. కేవలం గ్రూప్ నుండి ఎగ్జిట్ అయితే సరిపోదని ఈ గ్రూప్‌లో ఉన్న సభ్యుల వివరాలన్నీ సేకరించామని ఎస్ఐ తెలిపారు. పై అధికారులతో మాట్లాడి సభ్యులందరికీ ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహిస్తామని హెచ్చరించారు. మొత్తానికి మందుబాబుల డిజిటల్ స్కెచ్ కాస్తా పోలీసుల చేతికి చిక్కి ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది

## బండిసంజయ్ పై తీవ్ర విమర్శలు

**హైదరాబాద్ :** కేంద్ర మంత్రి బండి సంజయ్ పై తెలంగాణ ప్రభుత్వ విప్ వేముల వీరేశం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నియోజకవర్గాల పునర్విభజన, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న పోరాటాన్ని సమర్థిస్తూ, బీజేపీ వైఖరిని ఆయన తప్పుబట్టారు.నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని ప్రజల తరపున సీఎం మాట్లాడుతుంటే, కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ ఆ నష్టాన్ని అడ్డుకుంటామని చెప్పాల్సింది పోయి, సీఎంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశభక్తి కేవలం తనకే ఉన్నట్లు బండి సంజయ్ మాట్లాడుతున్నారని... కానీ, దేశం కోసం రక్తాన్ని ధారపోసిన చరిత్ర గాంధీ కుటుంబం, కాంగ్రెస్ పార్టీదని ఆయన గుర్తుచేశారు.రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న వాస్తవాలకు బీజేపీ నాయకులు భయపడుతున్నారని, అందుకే అవాకులు చెవాకులు పేలుతున్నారని ఎద్దేవా చేశారు.

## బిజినెస్

### భారత ఆర్థిక వృద్ధి రేటులో కోత ఆరు శాతానికి తగ్గింపు : మూడీస్ నివేదిక




**న్యూఢిల్లీ :** మూడీస్ రేటింగ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారతదేశ ఆర్థిక వృద్ధి అంచనాలను 6శాతానికి తగ్గించింది. గతేడాది ఆర్థిక వృద్ధి 6.8 శాతంగా ఉన్న సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధంతో వృద్ధి వేగం మందగిస్తోందని, ద్రవ్యోల్బణాన్ని పెంచే ప్రమాదం ఉందని మూడీస్ పేర్కొంది. భారతదేశ క్రెడిట్ రేటింగ్స్‌పై నివేదికను మూడీస్ ఆదివారం విడుదల చేసింది. యుద్ధం కారణంగా దీర్ఘకాలిక అంతరాయాలు ముఖ్యంగా ఎల్‌పీజీ రవాణా కారణంగా భవిష్యత్తులో గృహాలకు ఎల్‌పీజీ కొరత, అధిక ఇంధన, రవాణా ఖర్చులకు అలాగే దిగుమతి చేసుకున్న ఎరువులపై భారత్ ఆధారపడటంతో ఆహార ద్రవ్యోల్బణానికి దారితీయవచ్చని పేర్కొంది. ”పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా అధిక ధరలు, పెరిగిన ముడి సరుకుల వ్యయాల మధ్య ప్రయివేట్ వినియోగం క్షీణించడం, స్థూల స్థిర మూలధన నిర్మాణం బలహీనం కావడం భారతదేశ ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావం దృష్ట్యా 2026-27లో వాస్తవ జిడిపి వృద్ధి రేటు గతంలో 6.8 స్థాయి నుండి తగ్గి 6శాతానికి పరిమితమవుతుందని అంచనావేస్తున్నాం” అని మూడీస్ నివేదిక తెలిపింది.”ప్రస్తుతం ద్రవ్యోల్బణం అదుపులో ఉన్నప్పటికీ.. భౌగోళిక, రాజకీయ ఇబ్బందులు ద్రవ్యోల్బణ అంచనాలను పెరుగుదల దిశగా మళ్లించాయి” అని మూడీస్ పేర్కొంది. 2026 ఆర్థిక సంవత్సరంలో 2.4శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం, 2027లో సగటున 4.8శాతానికి చేరుకుంటుందని అంచనా వేసింది. ద్రవ్యోల్బణ ముప్పు తలెత్తడం, వృద్ధి బలంగా కొనసాగడంతో 2026-27 ఆర్థిక సంవత్సరంలో పాలసీ రేట్లు స్థిరంగా కొసాగవచ్చు లేదా క్రమంగా పెరగవచ్చు అని పేర్కొంది. పెరిగిన చమురు, గ్యాస్, ఎరువల ధరలు నిర్దేశిత సబ్సిడీపై ఒత్తిడిని తీవ్రతరం చేస్తాయని, ఫలితంగా బడ్జెట్‌తో పోలిస్తే రాబడి క్షీణతతో పాటు అధిక వ్యయాలకు దారితీయవచ్చని పేర్కొంది.

### నిబంధనలకు విరుద్ధంగా బొగ్గు తవ్వకాలు..! టాటా స్టీల్‌కు రూ.1,755 కోట్ల డిమాండ్ నోటీసు

రాంచీ : ప్రముఖ ఉక్కు తయారీ దిగ్గజం టాటా స్టీల్ లిమిటెడ్‌కు జార్ఖండ్ ప్రభుత్వం నుండి భారీ షాక్ తగిలింది. నిబంధనలకు విరుద్ధంగా అదనపు బొగ్గు తవ్వకాలు జరిపినట్లు పేర్కొంటూ రామ్‌గఢ్‌లోని జిల్లా మైనింగ్ కార్యాలయం ఆ కంపెనీకి రూ.1,755.10 కోట్ల డిమాండ్ నోటీసు జారీ చేసింది. ఈ మేరకు టాటా స్టీల్ శనివారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో సమాచారాన్ని వెల్లడించింది. జార్ఖండ్‌లోని వెస్ట్ బొకారో కొల్లియరీలో 2000-01 ఆర్థిక సంవత్సరం నుండి 2006-07 మధ్య కాలంలో అనుమతించిన పరిమితి కంటే అదనంగా బొగ్గును వెలికితీసినట్లు మైనింగ్ శాఖ ఆరోపిస్తోంది. ఈ నిర్దిష్ట కాలంలో సుమారు 1,62,40,399 మెట్రిక్ టన్నుల ఖనిజ బొగ్గును నిబంధనలు అతిక్రమించి సేకరించారని నోటీసులో పేర్కొన్నారు. 2026 మార్చి 30 నాటి ఈ నోటీసు ఏప్రిల్ 3న తమకు అందినట్లు టాటా స్టీల్ తెలిపింది. మైనింగ్ శాఖ చేసిన ఈ ఆరోపణలను టాటా స్టీల్ తోసిపుచ్చింది.

# దిగుమతి బిల్లు తడిసిమోపెడు!

### రూపాయి పతనం, చమురు ధరల ఎఫెక్ట్
### పెరుగుతోన్న వాణిజ్య లోటు
### పొంచి ఉన్న ద్రవ్యోల్బణ ముప్పు



**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ పాతాళానికి పడిపోవడం, చమురు ధరలు అమాంతం పెరగడం భారతదేశ దిగుమతి బిల్లును తడిసిమోపెడు చేయనుంది. ప్రస్తుతం దిగుమతి బిల్లు ప్రస్తుతం రెండు వైపుల నుండి ముప్పును ఎదుర్కొంటోంది. ఒకవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకుతుండగా, మరోవైపు అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ ఓ దశలో 95 కనిష్ట స్థాయికి పడిపోతోంది. ఈ రెండింటి వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి ఎదుర్కోనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఫిబ్రవరి 28న ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హార్మూజ్ తీర ప్రాంతంలో సరఫరా అంతరాయాలు చోటు చేసుకున్నాయి. భారత్ తన అవసరాలకు కావాల్సిన చమురుతో పాటు ఎలక్ట్రానిక్స్, బంగారం, ఎరువులు, పారిశ్రామిక యంత్రాలను ప్రధానంగా డాలర్లలోనే చెల్లింపులు చేసి దిగుమతి చేసుకుం టుంది. చమురు ధరల పెరుగుదల, రూపాయి బలహీనత ఏకకాలంలో సంభవించడం వల్ల వాణిజ్య లోటు పెరగడమే కాకుండా దేశీయం గా ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుడిపై భారం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**చమురు ధరలు రెట్టింపు..**

ఈ ఏడాది జనవరి 1 నుండి మార్చి 27 మధ్య కాలంలో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 60.75 డాలర్ల నుండి ఏకంగా 105.32 డాలర్లకు చేరుకుంది. ఇది దాదాపు 73.4 శాతం పెరుగుదల. ఇదే సమయంలో రూపాయి విలువ 89.96 నుండి 94.59కి పడిపోయి 5.1 శాతం క్షీణతను నమోదు చేసింది. ముఖ్యంగా ఇరాన్ యుద్ధం మొదలైన ఒక నెల రోజుల్లోనే చమురు ధరలు 45 శాతం పైగా పెరగడం గమనార్హం. రూపాయి పతనంతో వాణిజ్యలోటు పెరగడంతో పాటుగా కార్పొరేట్ రుణాల భారం పెరగనుంది. ప్రభుత్వ విదేశీ అప్పుల కు అదనంగా చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. మరోవైపు విదేశీ పెట్టుబడులు తరలిపోనున్నాయి.

**ఆర్థిక లోటుపై ప్రభావం**

గత ఏడాది కాలంగా రూపాయి విలువ పతనంలో రోజుకో రికార్డ్‌ను సృష్టిస్తోంది. 2025-26 బడ్జెట్‌లో ఆర్థిక లోటును 4.4 శాతంగా అంచనా వేసిన ప్రభుత్వం.. అంతర్జాతీయంగా ధరలు అదుపులో ఉంటాయని భావించింది. అయితే ప్రస్తుత పరిస్థితులు ఆ అంచనాలను తలకిందులు చేస్తున్నాయి. గతంలో 2022 ఉక్రెయిన్ యుద్ధ సమయంలో కూడా ఇలాంటి పరిస్థితులే తలెత్తి భారతదేశ వాణిజ్య లోటు దాదాపు రెట్టింపు అయ్యింది. ప్రస్తుతం ఏప్రిల్-ఫిబ్రవరి 2025-26 కాలానికి గానూ వాణిజ్య లోటు ఇప్పటికే 310.60 బిలియన్ డాలర్లకు చేరుకోవడం ఆందోళన కలిగి స్తోంది. ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటం వాణిజ్య లోటు అమాంతం పెరుగుతోంది.

**కేంద్రానికి సవాల్..**

బలహీనమైన రూపాయి వల్ల దిగుమతి చేసుకునే ప్రతి వస్తువు ధర పెరుగుతుంది. ఇది రవాణా ఖర్చులను పెంచి చివరికి నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి కారణమవుతుంది. ఈ దిగుమతి ద్రవ్యోల్బణం అటు ప్రభుత్వానికి, ఇటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు పెద్ద సవాలుగా మారింది. ఈ పతనాన్ని అరికట్టడానికి ఆర్‌బిఐ ఇప్పటికే రంగంలోకి దిగినప్పటికీ పెద్ద ఫలితాలు ఇస్తోన్నట్లు కనబడటం లేదు. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గకపోతే భారత ఆర్థిక వ్యవస్థ రాబోయే నెలల్లో మరిన్ని సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### తీవ్ర సంక్షోభంలో ఎల్ఎన్‌జి టెర్మినల్స్



**న్యూఢిల్లీ :** భారతదేశం తన ఇంధన అవసరాల కోసం భారీ పెట్టుబడులతో నిర్మించిన లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జి) టెర్మినల్స్ ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు సరఫరా వ్యవస్థను దెబ్బతీయడంతో దేశంలోని కీలక ఎల్ఎన్‌జి టెర్మినల్స్ వాటి పూర్తి సామర్థ్యంలో సగం కూడా వినియోగంలో లేవని తాజా గణాంకాలు వెల్లడిస్తున్నా యి. ముఖ్యంగా ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో గ్యాస్ ధరలు ఆకాశాన్ని తాకడం, రవాణా మార్గాల్లో ఆటంకాలు ఏర్పడటం ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా మారాయి. గత కొన్నేళ్లుగా భారత్ తన గ్యాస్ అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడటం పెరిగింది. ప్రస్తుత సరఫరా షాక్ కారణంగా మార్చి నెలలో ఎల్ఎన్‌జి దిగుమతులు గణనీయంగా తగ్గి 1.6 మిలియన్ టన్నులకు పరిమితమయ్యాయి. దేశంలోనే అతిపెద్దదైన దహేజ్ టెర్మినల్ తన సామర్థ్యాన్ని పెంచుకున్నప్పటికీ, దాని వినియోగం ప్రస్తుతం కేవలం 56 శాతానికి పడిపోయింది. అంతర్జాతీయంగా గ్యాస్ ధరలు ప్రతి ఎంఎంబిటియు 20 డాలర్లకు పైగా పెరగడంతో దేశీయంగా ఎరువులు, విద్యుత్, ఇతర పారిశ్రామిక రంగాలు గ్యాస్ వాడకాన్ని తగ్గించుకోవాల్సి వస్తోంది. ఈ పరిణామం భారీ వ్యయంతో నిర్మించిన ఎల్ఎన్‌జి ప్రాజెక్టుల ఆర్థిక మనుగడను ప్రశ్నార్థకం చేస్తోందని ఆ పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నా యి. ఒకవైపు అంతర్జాతీయంగా ధరల అస్థిరత కొనసాగుతుండగా మరోవైపు దేశీయ గ్యాస్ ఉత్పత్తి కూడా సుమారు 5 శాతం మేర తగ్గడం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసింది. పశ్చిమ ఆసియాలో యుద్ధ ఘర్షణలు త్వరగా తొలగకపోతే ఇంధన భద్రత విషయంలో భారత్ మరిన్ని సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని, దీని ప్రభావం పరోక్షంగా విద్యుత్, నిత్యావసర వస్తువుల ధరలపై పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఆరెంజ్ క్యాప్ రేసులో ఇంప్యాక్ట్ సబ్.. పర్పుల్ క్యాప్ పోటీలో దూసుకెళ్తున్న బిష్ణోయ్!




పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్ భారీ స్కోర్లు, ఉత్కంఠ పోరాటాలతో అలరిస్తోంది. దుమ్మురేపుతున్న కొందరు ఆరెంజ్ క్యాప్ కోసం పోటీపడుతున్నారు. ప్రతిసారి రేసులో ఉండే విరాట్ కోహ్లీ, జోస్ బట్లర్ వంటి స్టార్లు వెనకబడగా.. యువకెరటం సమీర్ రిజ్వీ శరవేగంగా దూసుకెళ్తున్నాడు. హెన్రిచ్ క్లాసెన్(సన్‌రైజర్స్ హైదరాబాద్) రెండో స్థానంలో నిలవగా.. రోహిత్ శర్మ(ముంబై ఇండియన్స్), దేవ్‌దత్ పడిక్కల్ (ఆర్సీబీ), కూపర్ కొన్నొలీ(పంజాబ్ కింగ్స్)లు టాప్-5లో చోటు దక్కించుకున్నారు. పర్పుల్ క్యాప్ విషయానికొస్తే.. రవి బిష్ణోయ్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఐపీఎల్‌లో దంచికొట్టినోళ్లదే ఆరెంజ్ క్యాప్. అత్యధిక పరుగులతో ఈ క్యాప్‌ను దక్కించుకున్న ఆటగాళ్ల జాబితాలో ఈసారి సమీర్ రిజ్వీ పేరు చేరేలా ఉంది. మీరుట్‌కు చెందిన ఈ కుర్రాడు పంతొమ్మిదో సీజన్‌లో ఇంప్యాక్ట్ సబ్‌గా చెలరేగిపోతున్నాడు. నిరుడు చెన్నై సూపర్ కింగ్స్(జూఖ) తరఫున పెద్దగా రాణించిన ఈ చిచ్చరపిడుగు.. ఈ దఫా ఢిల్లీ క్యాపిటల్స్(ఖవశ్రీప్తఱ ఖుజూఞుశ్రీం) ట్రంప్ కార్డ్‌గా అవతరించాడు. తొలి పోరులో అర్ధ శతకం.. రెండో మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 97 రన్స్ కొట్టి ఢిల్లీని గెలిపించిన సమీర్ 160 పరుగులతో టాప్‌లో ఉన్నాడు. ఈ సీజన్ టాప్ స్కోరర్ల జాబితాలో హెన్రిచ్ క్లాసెన్ రెండో స్థానంలో ఉన్నాడు. 147.96 స్ట్రయిక్ రేటు, రెండు హాఫ్ సెంచరీలతో కలిపి 145 పరుగులు సాధించాడీ హిట్టర్. ముంబై మాజీ సారథి రోహిత్ శర్మ 113 పరుగులతో మూడో ప్లేస్‌లో నిలవగా.. ఆర్సీబీ సంచలనం దేవ్‌దత్ పడిక్కల్ (111 పరుగులు) నాలుగు, పంజాబ్ కింగ్స్ విదేశీ స్టార్ కూపర్ కొన్నొలీ(108 పరుగులు) ఐదో స్థానాల్లో కొనసాగుతున్నారు. ప్రతి సీజన్‌లో ఆరెంజ్ క్యాప్ రేసులో ఉండే విరాట్ కోహ్లీ 97 పరుగులతో ఎనిమిదో స్థానంలో నిలిచాడు. ఆశ్చర్యంగా.. 202.04 స్ట్రయిక్ రేటుతో 99 పరుగులు చేసిన టెస్టు స్పెషలిస్ట్ సర్ఫరాజ్ ఖాన్ ఏడో స్థానంలో కొనసాగుతున్నాడు.

**పర్పుల్ క్యాప్ రేసులో..**

అత్యధిక వికెట్ల వీరులు అందుకునే పర్పుల్ క్యాప్ రేసులో భారత కుర్రాడు రవి బిష్ణోయ్ ముందంజలో ఉన్నాడు. రాజస్థాన్ రాయల్స్ విజయాల్లో కీలకం అవుతున్న ఈ లెగ్ స్పిన్నర్ రెండు మ్యాచుల్లో 11.40 సగటుతో 5 వికెట్లు పడగొట్టాడు.

### నా డ్రింక్ ఎందుకు తాగావు?



ఐపీఎల్-2026లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమ జోరు కొనసాగిస్తోంది. ఆర్సీబీ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం సీఎస్‌కేతో జరిగిన మ్యాచ్‌లో 43 పరుగుల తేడాతో ఆర్సీబీ గెలుపొందింది. ఈ విజయంతో పాటిదార్ సేన పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ అదరగొట్టింది. తొలుత బ్యాటింగ్ చేసిన బెంగళూరు జట్టు సీఎస్‌కే ముందు 251 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఈ కొండంత లక్ష్యాన్ని ఛేధించలేక సీఎస్‌కే 207 పరుగులకు ఆలౌటైంది. అయితే ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ ఇన్నింగ్స్ సందర్భంగా ఓ ఆశ్చర్యకర సంఘటన చోటు చేసుకుంది. రజత్ పాటిదార్, దేవదత్ పడిక్కల్ క్రీజులో ఉన్నప్పుడు ఆర్సీబీ సెకెండ్ డ్రింక్స్ బ్రేక్‌ను తీసుకుంది. సాధారణంగా డ్రిక్స్ బ్రేక్ సమయంలో కోచ్‌లు వ్యూహాలు పంచుకోవడానికి మైదానంలోకి వస్తుంటారు. ఈ క్రమంలో ఆర్సీబీ హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్, బ్యాటింగ్ కోచ్ దినేష్ కార్తీక్.. తమ బ్యాటర్లు పాటిదార్, పడిక్కల్ కోసం డ్రింక్స్ తీసుకుని మైదానంలో లోపలికి వచ్చారు. అయితే ఇక్కడే ఓ వింత సంఘటన చోటు చేసుకుంది.

రవికృష్ణ నవ్యస్వామి

పాటిదార్ కోసం తీసుకొచ్చిన డ్రింక్ బాటిల్‌ను అంపైర్ తీసుకుని తాగాడు. ఇది చూసిన పాటిదార్ వెంటనే అంపైర్ దగ్గరకు వెళ్లి తన బాటిల్ తనకు ఇచ్చేయమని అడిగాడు. దినేష్ కార్తీక్ కూడా అంపైర్‌తో కాస్త సీరియస్‌గానే మాట్లాడాడు. ఆ పక్కనే ఉన్న ఆండీ ఫ్లవర్ ఇదంతా చూస్తూ సైలెంట్‌గా ఉన్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. అయితే నెటిజన్లు కాస్త భిన్నంగా స్పందిస్తున్నారు. కొంత మంది ఈ ఘటనను హాస్యస్పదంగా తీసుకుంటుంటే, మరికొంత మంది పాటిదార్, కార్తీక్ తీరును తప్పుబడుతున్నారు.

## స్పోర్ట్స్

### త్వరలోనే టీమిండియా టీ20 కెప్టెన్ అవుతాడు’




టీ20 ఫార్మాట్లో గత కొంతకాలంగా పరుగుల వరద పారిస్తున్నాడు శ్రేయస్ అయ్యర్. ఐపీఎల్-2024లో కోల్‌కతా నైట్ రైడర్స్ సారథిగా వ్యవహరించిన ఈ ముంబైకర్.. జట్టును చాంపియన్‌గా నిలిపాడు. ఇక గతేడాది వేలంలో రూ. 26.75 కోట్లు పైగా వెచ్చించి పంజాబ్ కింగ్స్ అతడిని కొనుగోలు చేసి కెప్టెన్సీ పగ్గాలు అప్పగించింది. ఈ క్రమంలో ఐపీఎల్-2025లో బ్యాటర్‌గా, కెప్టెన్‌గా పంజాబ్‌కు పైసా వసూల్ ప్రదర్శన ఇచ్చాడు శ్రేయస్ అయ్యర్ (ౌష్ట్రతీవఖుం ×ఎవతీ). మొత్తంగా 17 మ్యాచ్‌లలో 604 పరుగులు సాధించిన ఈ కుడిచేతి వాటం బ్యాటర్.. సారథిగా పంజాబ్‌ను ఫైనల్‌కు చేర్చాడు. ఇక ఐపీఎల్-2026 టోర్నీని కూడా శ్రేయస్ అయ్యర్ ఘనంగా ఆరంభించాడు. ఇప్పటికి ఆడిన రెండు మ్యాచ్‌లలో జట్టును గెలిపించుకున్నాడు. బ్యాటర్‌గా రెండు మ్యాచ్‌లలో కలిపి 68 పరుగులు రాబట్టాడు. ఇదిలా ఉంటే.. గతేడాది దేశీ క్రికెట్‌లోనూ ముంబై తరఫున అయ్యర్ అదరగొట్టాడు. అయినప్పటికీ భారత టీ20 జట్టుకు సెలక్టర్లు అతడి పేరును పరిగణనలోకి తీసుకోనే లేదు. అయితే, పంజాబ్ కింగ్స్ పేసర్ వైశాఖ్ విజయ్‌కుమార్ మాత్రం శ్రేయస్ అయ్యర్ తప్పక టీమిండియా టీ20 కెప్టెన్ అవుతాడని అంచనా వేశాడు. సారథి అయ్యేందుకు అతడికి అన్ని అర్హతలు ఉన్నాయని కొనియాడాడు.

**త్వరలోనే టీమిండియా కెప్టెన్ అవుతాడు**

ఇండియా టుడేతో మాట్లాడుతూ.. “జట్టులోని ప్రతి బౌలర్, ప్రతి ఆటగాడికి అతడు ఎల్లవేళలా మద్దతుగా నిలుస్తాడు. బాగా ఆడినా.. ఆడకపోయినా వారికి అండగానే ఉంటాడు. ఆటగాళ్లకు కావాల్సింది ఇలాంటి కెప్టెనే. టీ20 ఫార్మాట్లో గత కొంతకాలంగా అతడు అత్యద్భుతంగా ఆడుతున్నాడు. కచ్చితంగా అతడు త్వరలోనే టీమిండియా కెప్టెన్ అవుతాడు” అని వైశాఖ్ విజయ్‌కుమార్ పేర్కొన్నాడు. కాగా వైశాఖ్ పంజాబ్ తరఫున ఇప్పటికి రెండు మ్యాచ్‌లలో కలిపి ఐదు వికెట్లు తీశాడు. ఇదిలా ఉంటే.. ఇటీవల సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో టీమిండియా టీ20 ప్రపంచకప్-2026 టైటిల్



## రాయవలస'లో ఏం జరిగింది?

రేసన్ ప్రొడక్షన్స్ తమ తొలి చిత్రమైన 'రాయవలస' ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఊరి జీవితం, నిజ సంఘటనల ఆధారంగా మనసును తాకే కథతో గోపీ కృష్ణ జె నిర్మిస్తున్నారు. అమెరికా నుంచి వచ్చిన ఎన్ఆర్ఐ మహిళా దర్శకురాలు రాధిక ఒకే షెడ్యూల్‌లో చిత్రీకరణను పూర్తి చేశారు.కార్తిక్‌ని హీరోగా పరిచయం చేసి నవ యువ కథానాయ కుడుగా ఆవిష్కరించడం ప్రేక్షకులలో మంచి స్పందన తెచ్చింది. అమెరికాలో పెరిగిన కార్తిక్ సింగర్‌గా ఎన్నో వేదికలపై ప్రదర్శనలు ఇచ్చారు. సింగర్ మాత్రమే కాక, వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిల్మ్స్, ఎన్నో ప్రైవేట్ ఆల్బమ్‌లలో నటించి, రైటర్, లిరిసిస్ట్, డ్యాన్సర్‌గా ప్రతిభ చాటారు. హీరో, టైటిల్‌ను విద్యార్థుల మధ్య ఒక కాలేజీలో గ్రాండ్‌గా లాంచ్ చేయడం, డెబ్యూ హీరో కార్తిక్ జయంతి పవర్‌ఫుల్, ఇంటెన్స్ లుక్‌తో ప్రజలు, సినీ ప్రముఖుల దృష్టిని వెంటనే ఆకర్షించింది. నిజ ఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రం ఒక రైస్‌మిల్ యజమాని రాజు జీవితం చుట్టూ తిరుగుతుంది. కుటుంబం, స్నేహితులు, గ్రామ పిల్లలతో సాగుతున్న అతని జీవితంలో హీరోయిన్ ప్రవేశం అనూహ్య మలుపులు తీసుకువస్తుంది. భావోద్వేగం, యాక్షన్, సంగీతంతో కంప్లీట్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను అలరించనుంది అని మేకర్స్ అన్నారు.




# బ్లాక్ బస్టర్ టాక్‌తో 'రాకాస' ప్రభంజనం

**రెండు రోజుల్లోనే రూ. 10.30 కోట్ల వరల్డ్ వైడ్ వసూళ్లు!**

జీ స్టూడియోస్ సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి నిహారిక కొణిదెల 'రాకాస' చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీకి మానస శర్మ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3న రిలీజ్ చేశారు. సినిమా సూపర్ హిట్ టాక్‌తో తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్‌సీస్‌లోనూ దూసుకెళ్తోంది. ఏపీ, తెలంగాణలో శ్రీలక్ష్మీ నరసింహా మూవీ మేకర్స్ బ్యానర్‌పై విడుదలైన చిత్రాన్ని ఓవర్‌సీస్‌లో అథర్వణ భద్రకాళి పిక్చర్స్ భారీ ఎత్తున రిలీజ్ అయ్యింది.డిఫరెంట్ ప్రమోషనల్ స్ట్రాటజీతో 'రాకాస' సినిమాపై అనౌన్స్‌మెంట్ నుంచే అంచనాలు ఏర్పడ్డాయి. రెండు రోజుల్లోనే సినిమా వరల్డ్ వైడ్‌గా రూ.10.30 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టటం విశేషం. శుక్ర, శనివారాల్లో సినిమాకు వచ్చిన రెస్పాన్స్ ఆదివారానికి డబుల్ అయ్యింది. 24 గంటల్లోనే 60 వేలకు పైగా టికెట్స్ సేల్ కావటం సినిమాపై ఉన్న పాజిటివ్ బజ్‌కు నిదర్శనమని ట్రేడ్ సర్కిల్స్ చెబుతున్నాయి.జీస్టూడియోస్ సమర్పణలో ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి నిహారిక కొణిదెల సినిమాను రూపొందించిన తీరు, డైరెక్టర్ మానస శర్మ టేకింగ్ సహా ఇతర నటీనటులు, టెక్నీషియన్స్ పని తీరుని అందరూ అప్రిషియేట్ చేస్తున్నారు. నిర్మాతగా నిహారిక తన తొలి చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'తో బ్లాక్ బస్టర్ సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో బ్లాక్ బస్టర్ హిట్‌ను సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. సంగీత్ శోభన్ కామెడీ టైమింగ్, నయన్ సారిక గ్లామర్, గెటప్ శ్రీను, బ్రహ్మాజీ తదితరులు ఎంటర్‌టైన్ చేసిన విధానం ప్రేక్షకుల మన్ననలు పొందుతున్నాయి.

# శక్తివంతమైన గోండ్ మహిళగా..

రష్మిక మందన్న లీడ్ రోల్‌లో తెరకెక్కుతున్న ఫీమేల్ -సెంట్రిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మైసా'. దర్శకుడు రవీంద్ర పుల్లే దర్శకత్వంలో అన్‌ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. రష్మిక పుట్టినరోజు సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్.ఈ పోస్టర్‌లో రష్మిక గాయాలతో నిండిన, యుద్ధం చేసినట్లుగా కనిపించే లుక్‌లో కనిపిస్తోంది. ఆమె ముఖం మీద మట్టి, పొగ, రక్తపు మరకలు కనిపి స్తుండగా, ముక్కు, చెంపలు, నుదుటిపై ఉన్న గాయాలు ఆమె పాత్ర ఎదు ర్కొన్న క్రూరత్వాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. అయినప్పటికీ, ఆమె కళ్లలో కనిపించే ఆగ్రహం, తీవ్రత మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ఆ పాత్రకు అవసరమైన రా ఫెరోసిటీని అద్భుతంగా ప్రతిబింబిస్తోంది. గోండ్ తెగల సాంస్కృతిక నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రష్మికను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని విధంగా, ఓ శక్తివంతమైన గోండ్ మహిళగా కనిపించనున్నారు. ఎమోషన్స్, హై-ఆక్టేన్ యాక్షన్ మేళవింపుతో, ఈ చిత్రం పాన్-ఇండియా స్థాయిలో భారీగా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో ఈశ్వరీ రావు, గురు సోమసుందరం, రావు రమేష్ కీలక పాత్రలలో నటిస్తున్నారు.




# 15 ఏళ్ల ప్రాయంలోనే డీప్‌ఫేక్ వేధింపులు

**నాటి చేదు జ్ఞాపకాలపై జాన్వీ కపూర్ భావోద్వేగం!**

అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా సినీ రంగంలో అడుగుపెట్టిన జాన్వీ కపూర్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా కొనసాగుతోంది. బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటూనే, తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు 'పెద్ది' సినిమాతో సిద్ధమవుతోంది. అయితే తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న జాన్వీ తన జీవితంలో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని వెల్లడించి అందరినీ ఆలోచనలో పడేసింది.జాన్వీ కపూర్ మాట్లాడుతూ, తాను కేవలం 15 ఏళ్ల వయసులోనే డీప్‌ఫేక్ టెక్నాలజీ కారణంగా ఒక విచిత్రమైన ఘటనను ఎదుర్కొన్నానని తెలిపింది. "అప్పుడు నేను స్కూల్‌లో చదువుకుంటున్నాను. ఒక రోజు నా ఫ్రెండ్ ఒక అశ్లీల వెబ్‌సైట్‌లో నా ఫోటో ఉందని చెప్పాడు. అది నిజానికి నా ఫోటో కాదు... డీప్‌ఫేక్ ద్వారా తయారు చేసిన ఫోటో" అని ఆమె చెప్పుకొచ్చింది.ఈ సంఘటన తనపై తీవ్ర ప్రభావం చూపిందని జాన్వీ వెల్లడించింది. "ఆ ఫోటో గురించి తెలిసినప్పుడు నేను చాలా షాక్‌కు గురయ్యాను. ఏమి చేయాలో అర్థం కాలేదు. ఆ సమయంలో నేను చాలా బాధపడ్డాను. అదే సమయంలో సోషల్ మీడియా లో నైతికత ఎంత తక్కువగా ఉందో నాకు అర్థమైంది" అని ఆమె తెలిపింది. అప్పుడే నేను గ్రహించాను... భవిష్యత్తులో కూడా ఇలాంటి విషయాలు ఎదురవుతాయని. అందుకే ఇప్పుడు ఇలాంటి డీప్‌ఫేక్ ఫోటోలు వచ్చినా వాటిని ఎక్కువగా పట్టించుకోను అని జాన్వీ కపూర్ స్పష్టం చేసింది.సోషల్ మీడియాలో టెక్నాలజీ దుర్వినియోగం ఎలా వ్యక్తిగత జీవితాలను ప్రభావితం చేస్తుందో ఈ ఘటన మరోసారి చూపిస్తోంది. ముఖ్యంగా డీప్‌ఫేక్ వంటి టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో, సెలబ్రిటీలే కాక సాధారణ ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే, జాన్వీ కపూర్ ప్రస్తుతం పలు సినిమాలతో బిజీగా ఉంది. తెలుగు చిత్రం 'పెద్ది'తో పాటు బాలీవుడ్‌లో కూడా వరుస ప్రాజెక్టులతో ఆమె కెరీర్ పీక్‌లో కొనసాగుతోంది.



# యూనిక్ సైకలాజికల్ థ్రిల్లర్



మలయాళ సినిమా తన సహజమైన కథనం, సాంకేతిక నైపుణ్యంతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అగ్రశ్రేణి మలయాళ చిత్ర నిర్మాతలు ఇప్పుడు ప్రముఖ తెలుగు స్టార్లతో కలిసి పనిచేస్తున్నారు. 'మిన్నల్ మురళి' ఫేమ్ బాసిల్ జోసెఫ్, అల్లు అర్జున్‌తో ఒక సినిమాకు దర్శకత్వం వహించడానికి సిద్ధమవుతుండగా, 'కిష్కింధ కాండం', 'ఏకో' చిత్రాలతో పేరొందిన దిన్‌జీత్ అయ్యతన్, ప్రభాస్‌తో ఒక ప్రాజెక్ట్‌కు ప్లాన్ చేస్తున్నారు.ఈ క్రమంలోనే తెలుగులో యూనిక్ సైకలాజికల్ థ్రిల్లర్ వస్తోంది. గతంలో మలయాళ-తమిళ ద్విభాషా థ్రిల్లర్ మమ్ముట్టి 'స్ట్రీట్ లైట్స్'కి దర్శకత్వం వహించిన సినిమాటోగ్రాఫర్ షామ్‌దత్, ఇప్పుడు 'చౌర్య పాఠం'లో ఆకట్టుకున్న ఇంద్ర రామ్ హీరోగా నటిస్తున్న ఈ కొత్త చిత్రంతో తెలుగులో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు.వి.చూడామణి ఈ చిత్రాన్ని వి డ్రీమ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం 2 గా నిర్మిస్తున్నారు. ఆదివారం హీరో విజరు సేతుపతి ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను ఆవిష్కరించారు. 'డోంట్ స్లీప్' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో ఈ సైకలాజికల్ థ్రిల్లర్ అలరించనుంది.ఫస్ట్-లుక్ పోస్టర్ లో రవీంద్ర విజరు పాత్ర, తుపాకీతో మంచు పర్వతాల మీదుగా ఇంద్ర రామ్‌ను వెంబడిస్తుండగా, ముందు భాగంలో హీరో కళ్ళు మూసుకుని, నుదుటిపై కట్టుతో కనిపించడం ఆసక్తికరంగా ఉంది.ఎమోషనల్‌గా, టెక్నికల్‌గా ఈ చిత్రం గొప్ప సైకాలజికల్ థ్రిల్లర్ అనుభూతిని ప్రేక్షకులకు అందించబోతుంది. ఈ చిత్రం త్వరలోనే థియేటర్లలో విడుదల కానుందని మేకర్స్ ప్రకటించారు.ఇంద్ర రామ్, రవీంద్ర విజరు, తబా రీమా, జ్యోతి బెనర్జీ, సునీల్ థాపా, ఆడుకలం నరేన్, కల్ప లత, అనీష్ కురువిల్లా, వెన్నెల కిషోర్, నాగి జబర్దస్త్, డాక్టర్ భద్రమ్, రఘుబాబు తదితరులు.నటిస్తున్న ఈ చిత్రానికి డైరెక్టర్, డీఓపీ : షామ్‌దత్, కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు: సజీర్ బాబా, లూనా జబిన్, నిర్మాత: వి చూడామణి, సంగీతం: గోకుల్ హర్షన్, ప్రొడక్షన్ డిజైన్: మోనికా రామకృష్ణ.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com